# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :13 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 28-02-2024 | పేజీలు:4 వెల: 2.00


## పసుపు పైపైకి.. క్వింటాల్‌కు రూ.14వేలకుపైనే..

మెట్‌పల్లి,ఈసారి పసుపు ధరలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు కాస్త తగ్గినా.. రేట్లు మాత్రం రోజురోజుకూ పైపైకి చేరుతున్నాయి. మెట్‌పల్లి వ్యవసా య మార్కెట్‌లో పసుపు క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండగా.. సోమవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.14,005 పలికింది. పసుపు కాడి (కొమ్ము)కు ఈ ధర పలుకడం ఈ సంవత్సరం ఇదే తొలిసారి. కనిష్ఠంగా రూ.5 వేలు పలికింది. పసుపు గోళ (మండ) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,511, కనిష్ఠంగా రూ.5,001, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.10,044, కనిష్ఠంగా రూ.6,060 పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 3,446 క్వింటాళ్ల పసుపు క్రయవిక్రయాలు జరిగినట్టు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## ఓటుకు ఆధార్ తప్పనిసరి కాదు.. కేంద్ర ఎన్నికల సంఘం క్లారిటీ..



హైదరాబాద్,ఓటర్ నమోదుకు ఆధార్ తప్పనిసరి కాదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆధార్ కార్డు లేకపోతే ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించకోకుండా ఆపబోమని తృణమూల్ కాంగ్రెస్ బృందానికి స్పష్టం చేసింది. ఓటరు గుర్తింపు కార్డు, లేదా ఏ ఇతర చెల్లుబాటు అయ్యే వ్యక్తిగత గుర్తింపు కార్డులతో ఓటు వేసేందుకు అనిమతిస్తామని హామీ ఇచ్చింది.పశ్చిమ బెంగాల్ ప్రజలు వేల సంఖ్యలో ఆధార్ కార్డులను డియాక్టివేట్ చేస్తున్నారని తృణమూల్ ఎంపీలు ప్రధాన ఎన్నికల కమీషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ కు ఫిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో తృణమూల్ నేతలు మాట్లాడుతూ ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాలపై నిఘా కోసం జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని , దీనిపై ఈసీ నిర్ణయం తీసుకుందని, తమ రాష్ట్రంలో ఆధార్ కార్డుల డీయాక్టివేషన్ ఏర్పాటు కావడం ఇదే తొలిసారి అని తృణమూల్ నేతలు విలేకరులకు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు ప్రజలను భయభ్రాంతు లకు గురి చేసేలా వ్యవహరించాయని ఈ సారి అలాంటివి జరగకు ండా చట్టానికి అనుగుణంగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని పార్టీ తరుపున వారు సీఈసీని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించి పోలింగ్ శాతాన్ని పెంచేలా ప్రయత్నం చేస్తుంది. బ్యాంకులు, పోస్టాఫీస్ శాఖలో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. భారతీయ బ్యాంకులు సంఘం, పోస్టాఫీస్ శాఖలతో సోమవారం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

## ఓడాక ఆ ఫ్యామిలీలో 4గురి ఘోష..

హైదరాబాద్,చురక పెట్టిన రేవంత్ డైలీ బేసిస్ లో తనపై విమర్శలు చేస్తున్న కేసీఆర్ కుటుంబంపై మరోసారి చివాట్లు పెట్టారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తెలంగాణ ఎన్నికల సమయంలో రేవంత్ ను ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ పార్టీ తరపున 30సీట్లు కూడా వచ్చేవి కావంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు తాను పాల్గొనే ప్రతి ప్రోగ్రాంలోనూ మాజీ మంత్రి హరీశ్ సైతం సీఎం రేవంత్ పై విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు. ఇలాంటి వేళ.. తాజాగా సచివాలయంలో సింగరేణి కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా నిదర్శనం.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ కేసీఆర్ కుటుంబంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఎన్నికల్లో ఓడిన తర్వాత కూడా ఆ కుటుంబంలోని నలుగురి ఘోష మాత్రమే వినిపిస్తోందంటూ చురకలంటించారు. వివాదాల పేరుతో వేలాది ఉద్యోగాల భర్తీని నిలిపేశారన్న ఆయన.. కోర్టు కేసులను పరిష్కరించి నియామక పత్రాలను తాము అందించామని తెలిపారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కట్ట ప్రాజెక్టులు కూలిపోతున్నట్లుగా ఉన్నాయి. కుంగిపోయిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎలా ఎత్తిపోయాయో చెప్పమంటే చెప్పలేదన్న సీఎం రేవంత్.. అన్నారం పగిలిపోయిన కారణంగా నీళ్లు వృథాగా పోతున్నాయి. ఏపీ ప్రభుత్వం వందల టీఎంసీలు తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్న ఆయన.. ముఖ్యమంత్రి జగన్ కు విందులు ఇచ్చి ఒప్పందాలు చేసుకొని కృష్ణా జలాల్ని ఇచ్చారన్నారు. తెలంగాణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దివాలా తీయించారని తెలిపారు.రూ. 7లక్షల కోట్ల అప్పు ఊబిలోకి నెట్టారని.. ఇవాళ అప్పులపై వడ్డీలకే ఏటా రూ.70వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇంత వేగంగా ఒక రాష్ట్రాన్ని దివాలా తీయించిన ముఖ్యమంత్రి దేశంలోనే మరెవరూ లేరన్న రేవంత్.. ప్రభుత్వ



ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితిని కేసీఆర్ కల్పించారు. సంక్షేమ పథకాలు పేదలకు అందాలన్న ఉద్దేశంతో రేషన్ కార్డులకు నిబంధనలు పెడుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపు నిరంతరం సాగుతుందని.. కొత్త రేషన్ కార్డుల్ని జారీ చేసి.. నిరంతరం కొత్త లబ్దిదారుల్ని చేరుస్తామన్నారు. ఎలాంటి పరిమితులు లేకుండా పథకాలను వర్తింపజేస్తే కోటీశ్వరులు కూడా దరఖాస్తులు పెట్టుకుంటారన్న ముఖ్యమంత్రి.. కొన్నేళ్లుగా వానలు బాగా పడడంతో జలాలు పెరిగాయని.. రాష్ట్రంలో బోర్ల సంఖ్య పెరిగిందన్నారు. ఈ కారణంతోనే వారి ఉత్పత్తి పెరిగిందన్న రేవంత్.. ఇదేమీ కేసీఆర్ గొప్పతనం కాదన్నారు. ఈ వర్షాలు సరిగా లేకపోవటం వల్ల ఇప్పుడు భూగర్భ జలాలు తగ్గిపోయాయని.. ఇప్పుడు భూగర్భ జలాలను కేసీఆర్ పెంచుతారా? అంటూ రేవంత్ చేసిన ఎద్దేవా ఆసక్తికరంగా మారింది.

## ఈడీ విచారణకు అరవింద్ కేజ్రీవాల్ ఎందుకు వెళ్లడం లేదు?



న్యూఢిల్లీ, లిక్కర్ పాలసీ కేసులో ఈడీ విచారణకు మరోసారి గైర్హాజరయ్యారు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్. ఇప్పటికే 6 సార్లు జారీ చేసిన నోటీసులను లెక్క చేయని ఆయన.. ఏడోసారి కూడా వాటిని బేఖాతరు చేశారు. అయితే.. విచారణ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే మళ్లీ మళ్లీ సమన్లు పంపడం వేధింపులకు పాల్పడటమేనన్నారు కేజ్రీవాల్. మరోవైపు.. 2018 పరువు నష్టం కేసులో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది సుప్రీంకోర్టు.ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు వరుసగా నోటీసులు జారీ చేస్తూనే ఉంది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. ఇటీవల ఏడోసారి నోటీసులు జారీ చేసిన ఈడీ.. సోమవారం విచారణకు హాజరు కావాలని సూచించింది. కానీ.. ఈసారి కూడా ఎంక్వైరీకి రెడీగా లేనని తేల్చిచెప్పారు కేజ్రీవాల్. మళ్లీమళ్లీ సమన్లు పంపించే బదులు.. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి ఉంటే బాగుంటుందని ఈడీకి హితవు పలికారాయన. తాము ఇండియా కూటమిని వదిలిపెట్టాలన్న ఉద్దేశంతోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు కేజ్రీవాల్.ఈ కేసులో సీఎం కేజ్రీవాల్‌ను ఇప్పటికే ఒకసారి విచారించింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. గతేడాది ఏప్రిల్‌లో దాదాపు 9 గంటల పాటు ఆయన్ను విచారించారు అధికారులు. ఆ తర్వాత నవంబర్ నుంచి నాలుగు నెలల్లోనే ఏడుసార్లు నోటీసులు పంపించింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. గతేడాది నవంబర్ 2, డిసెంబర్ 21, ఆ తర్వాత జనవరి 3, జనవరి 13, జనవరి 31న వరుసగా ఐదు సార్లు సమన్లు జారీ చేసింది. ప్రతిసారీ ఈడీ నోటీసుల్ని కేజ్రీవాల్ పట్టించుకోలేదు.కేజ్రీవాల్ విచారణకు హాజరుకాకపోవడంతో గత ఫిబ్రవరిలో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించింది ఈడీ. ఆయన విచారణకు హాజరయ్యేందుకు ఆదేశించాలని పిటిషన్ దాఖలు చేసింది. అయితే.. ఢిల్లీ అసెంబ్లీలో బల పరీక్ష నేపథ్యంలో కేజ్రీవాల్ కోర్టుకు వర్చువల్‌గా కోర్టుకు హాజరయ్యారు. ఆ తర్వాత కేసు విచారణను మార్చి 16కు వాయిదా వేసింది న్యాయస్థానం. ఈ క్రమంలోనే మరో రెండుసార్లు కూడా కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది ఈడీ. ఫిబ్రవరి 22న ఏడోసారి సమన్లు పంపిన ఈడీ.. 26న ప్రత్యక్షంగా విచారణకు హాజరుకావాలని పేర్కొంది.

పరువు నష్టం కేసులో కేజ్రీవాల్‌కు ఊరట

మరోవైపు.. 2018 పరువు నష్టం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. యూట్యూబర్ ధ్రువ్ రాథీ వీడియోను రీట్వీట్ చేసిన కేసులో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ట్రయల్ కోర్టును ఆదేశించింది సుప్రీంకోర్టు. అయితే.. పరువుకు భంగం కలిగించేలా ఉన్న వీడియోను రీట్వీట్ చేయడం పొరపాటేనని.. ఆ కేసును మూసివేయాలని న్యాయస్థానాన్ని కోరారు కేజ్రీవాల్. అయితే.. ఈ కేసు దాఖలు చేసిన పిటిషనర్.. కేజ్రీవాల్ అభ్యర్థనకు అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది. దీంతో ఢిల్లీ సీఎంపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది.

### చెన్నై పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

చెన్నై,చెన్నైలోని స్థానిక జీఎన్ చెట్టిరోడ్డులో వున్న పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 28న బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కుంకుమార్చనతో ప్రారంభం అయ్యింది. సాయంత్రం విష్వక్సేన ఆరాధన అంకురార్పణ జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు ఉదయం మధ్య ధ్వజారోహణం జరగనుండగా, సాయంత్రం 7 గంటలకు చిన్న శేషవాహనంపై తాయారు అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదే విధంగా 29న ఉదయం 9 గంటలకు పెద్ద శేష వాహనం, సాయంత్రం 7 గంటలకు హంస వాహనం, మార్చి 1వ తేదీన ఉదయం 9 గంటలకు ముత్యపు పందిరి, సాయంత్రం 7 గంటలకు సింహవాహనం, 2వ తేదీన ఉదయం 9 గంటలకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 7 గంటలకు హనుమంత వాహనం, 3వ తేదీన ఉదయం 9 గంటలకు పల్లకి ఉత్సవం, సాయంత్రం 7 గంటలకు గజ వాహనం, 4న ఉదయం 9 గంటలకు సర్వభూపాల వాహనం, సాయంత్రం 7 గంటలకు గరుడ వాహనం, 5న ఉదయం 9 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం 7 గంటలకు చంద్రప్రభ వాహనం, 6న ఉదయం 9 గంటలకు రథోత్సవం,

## మార్చి నుంచి బీఆర్ఎస్ చలో మేడిగడ్డ..

హైదరాబాద్,మార్చి ఒకటి నుంచి చలో మేడిగడ్డ పిలుపునిచ్చినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. 150-200 మంది బీఆర్ఎస్ ప్రతినిధులతో కార్యక్రమం నిర్వహించబడింది. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన్ నుంచి మేడిగడ్డ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తొలిరోజు కాళేశ్వరం వెళ్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని తెలంగాణ ప్రజలతో పాటు ఆరోపణలు చేస్తున్న వారికి చూపిస్తామన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే మేడిగడ్డకు వెళ్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ఏంటే ఏంటో సజీవంగా చూపిస్తామన్నారు. విడతల వారిగా కాళేశ్వరం ప్రాజెక్టును సమగ్రంగా సందర్శిస్తామన్నారు.

సజీవంగా చూపెట్టాలని..

'అసలు కాళేశ్వరం అంటే ఏమిటి..? రాష్ట్ర ప్రజలకు ఈ రోజు చెప్పదలచు కున్నాం.. దానితో పాటు కొందరు తెలిసీ తెలియక మాట్లాడుతున్న వారికి సజీవంగా చూపెట్టాలని మేడిగడ్డకు బయలుదేరి వెళ్తున్నారు. కేసీఆర్ నల్లగొండ బహిరంగ సభలోనే స్పష్టంగా చెప్పారు. మీరు వెళ్లడం కాదు.. మేడిగడ్డకు.. అన్నారం వెళ్తాం.. సుందిళ్లకు వెళ్తాం.. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా సజీవంగా చూస్తాం. కాళేశ్వరం అంటే మేడిగడ్డ కాదు మూడు బరాజ్‌లు. కాళేశ్వరం అంటే 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 పారిశ్రామిక సొరంగాలు, 1531 ప్రాంతంలో ప్రవాహ కాలువలు. కాళేశ్వరం అంటే 141 టీసీల స్టోరేజ్ కెపాసిటీ..240 టీఎంసీల వినియోగం. వీటన్నింటి సమగ్ర సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్టు' అని తెలిపారు. చిల్లర మాటలు మాట్లాడుతున్నారు..'రూ.లక్షకోట్ల విలువైన ప్రాజెక్టు అని ఒక వైపు చెబుతూ.. రూ.లక్షకోట్లు కొట్టుకుపోయిందని ఓవైపు చిల్లర మాటలు మాట్లాడుతూ.. రూ.3వేలకోట్ల బరాజ్‌ను అందులో 84 మంది పిల్లలు ఉంటే.. మూడు పిల్లలకు ప్రమాదం వస్తే మొత్తం బరాజ్ కొట్టుకుపోయిందన్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ కాదు. అన్నింటింకి మించి 40లక్షలకుపై చీలుకు ఎకరాలకు నీర్చి కామధేనువు కాళేశ్వరం. 88మీటర్ల ఎత్తు నుంచి సముద్రమట్టం మీద 618 మీటర్ల ఎత్తుకు గోదావరి గంగను పైకి ఏటికి ఎదురీదుతూపైకి తీసుకొని పోయే బృహత్తర కార్యక్రమం కాళేశ్వరం. తెలంగాణ టోఫోగ్రఫీకి తెలిసిన వారికి తెలుస్తుంది. తెలంగాణ దాదాపు ఒక గుడిసెలా ఉంటుంది. మధ్య హయ్యర్ ప్లాటో ఉంటే ఒక వైపు కృష్ణ, ఒక వైపు




గోదావరి ప్రవహిస్తుంటుంది. పైన 535 మీటర్లపైన హైదరాబాద్‌లాంటి పట్టణం ఉంది. కొండపోచమ్మసాగర్ ప్రాంతం 618 మీటర్ల ఎత్తు ఉంది. లక్ష్మీదేవిపల్లి, షాద్‌నగర్ ఏరియాలో658 మీటర్లు. ఏటవాలుగా ఉండే పరిస్థితి తెలంగాణది' అన్నారు.

భగీరథ ప్రయత్నమే కాళేశ్వరం..

'తెలంగాణ టోఫోగ్రఫీ, దాని పరిస్థితి తెలిసిన వారు ఎవరైనా తెలుసుకునేది ఏంటంటే.. దిగువన పారుతున్న గోదావరిని ఎగువకు రప్పించేందుకు చేసిన భగీరథ ప్రయత్నమే కాళేశ్వరం. తెలంగాణ రాష్ట్రానికి, రైతాంగానికి కామధేనువు కాళేశ్వరం. తెలంగాణను కరువు నుంచి గట్టెక్కించే కామధేనువు కాళేశ్వరం. తాగు, సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసే కామధేనువు. ఈ కాకుండా ప్రాజెక్టు చేయడానికి ఎన్నో కేసులు వేశారు. కేసీఆర్‌కు మస్త్ పేరొస్తది.. తెలంగాణ దశాబ్దాలు పడ్డ కష్టం తీరిస్తే కేసీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోతాడని ఎన్నో కేసులు వేసిన తర్వాత వాటిని అధిగమించి 400పైగా గోదావరిని మన పొలాల్లో ఒప్పొంగేలా చేసింది.నాటి ప్రభుత్వం మీకు నీళ్లు రావు.. దశాబ్దాల పాటు జరిగిన మోసం ఏది ఉందో.. దానికి ముగింపు పలికి గోదావరిలో మన వాటా మనం తీసుకునే స్థాయికి.. కాళేశ్వరం ప్రాజెక్టుతో మన హక్కులను కాపాడుకున్నాం. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఉద్యమం దెబ్బకు జడిసి జలయజ్ఞంలో ఆదరాబాదరగా పెట్టారు. ప్రాణహిత, తుమ్మిడిహట్టి నుంచి హైదరాబాద్ పక్కనే ఉండే చేవెళ్లకు నీళ్లు తెస్తమని నమ్మబలికి ఆ నాడు ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఎక్కడి చేవెళ్ల, ఎక్కడి తుమ్మిడిహట్టి.. అక్కడి నుంచి ఇక్కడికి నీళ్లు తెచ్చే ప్రాజెక్టులో ఆ నాడు. స్టోరేజ్ అనే కాన్సెప్ట్ లేదు' అని గుర్తు.

## లోక్‌సభ ఎన్నికల బరిలో అక్షయ్ కుమార్..?



న్యూఢిల్లీ, లోక్‌సభ ఎన్నికలకు (లోక్‌సభ ఎన్నికలు) సమయం దగ్గరపడుతోంది. మరో పది రోజుల్లో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో అన్ని పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రచారాన్ని కూడా మొదలు పెట్టేశాయి.ఇక దేశరాజధాని ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి. అక్కడ అధికార ఆప్, కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు కుదిరిన విషయం తెలిసిందే. ఢిల్లీలో మొత్తం 7 లోక్‌సభ స్థానాలు ఉండగా ఆప్ నాలుగింట్లో, కాంగ్రెస్ మూడింట్లో బరిలోకి దిగబోతోంది. గత ఎన్నికల్లో ఢిల్లీలోని 7 లోక్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఆప్, కాంగ్రెస్ పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయి. కానీ, బీజేపీ సైతం ఈ ఎన్నికల్లో కూడా ఢిల్లీని క్లీన్‌స్వీప్ చేయడం చూస్తోంది.ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్‌కి గట్టి పోటీ ఇచ్చేందుకు ఏడు స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఓ లోక్‌సభ స్థానం నుంచి స్టార్ నటుడిని బరిలోకి దించాలని యోచిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. స్థానికతను దృష్టిలో ఉంచుకొని బాలీవుడ్ యాక్షన్ హీరో అక్షయ్ కుమార్ (అక్షయ్ కుమార్)ని లోక్‌సభ బరిలో నిలపబోతోందని సమాచారం. చాందినీ చౌక్ (చాందినీ చౌక్) నుంచి అక్షయ్ పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే పార్టీ నేతలు అక్షయ్‌ను ఒకసారి సంప్రదించారని వారి కథనాలు వెల్లడించారు. అయితే, అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు.

## సింగరేణి కార్మికులకు కోటి ప్రమాద బీమా

హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తాను మాట్లాడుతున్నది రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలోనిది మరిచిపోయి.. పీసీసీ అధ్యక్షుడిగా గాంధీ భవన్‌లో మాట్లాడుతున్నానంటూ రాజకీయ విమర్శలు, వ్యాఖ్యలు చేస్తున్నారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడిన తీరే నిదర్శనమని విశ్లేషకులు చూస్తున్నారు.సింగరేణి, బ్యాంకులకు మధ్య జరిగిన ఒప్పందం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అసలు పక్కన పెట్టి పాత ప్రభుత్వంపై, ప్రతిపక్ష పార్టీలపై దుమ్మెత్తిపోయడానికి ప్రాధాన్యమిచ్చారు. అధికారంలో ఉన్నవారు సచివాలయంలో.. ప్రభుత్వ పార్టీ పార్టీ అధినేతగా వ్యవహరించాలి. ఇవన్నీ మర్చిపోయిన రేవంత్ రెడ్డి కేవలం రాజకీయ విమర్శలు, గత ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కడం కోసమే సమావేశాన్ని ఉపయోగించుకున్నారు.

బీఆర్ఎస్‌పై విమర్శలు

బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తండ్రీ కొడుకులు, మామ అల్లుండ్లు తప్ప.. ఎవరూ వారితో ఏకీభవించలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ విమర్శలకు దిగారు. శాసనమండలిలో కల్వకుంట్ల కవిత, శాసనసభలో హరీశ్‌రావు లేదా కేటీఆర్, బహిరంగ సభల్లో కేసీఆర్.. ఈ నల్గురు తప్పితే ఎవరైనా ఆమోదిస్తున్నారా అంటూ నినాదాలు చేశారు. తాము 70 రోజుల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. వారి నియామక పత్రాలు ఇస్తుంటే.. వారి హయాంలోనే నోటిఫికేషన్లు, పరీక్షలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి, 'ఇన్ని చేసినోళు ..అదికూడా మీరే చేసి ఉండవచ్చుకదా' అని. తెలంగాణను ఇచ్చింది, తెలంగాణను కాపాడేది, అభివృద్ధి పథంవైపు నడిపించేది, సంక్షేమ పథకాలను అమలు చేసేది కాంగ్రెస్ పార్టీ.. అంటూ ఫక్తు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మాట్లాడారు.

సింగరేణి ఒప్పందం..

సింగరేణి కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమాకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం భాస్కర్‌రావు ఒక ఒప్పందంపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా, ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జరిగింది.

కార్మిక లోకానికి చరిత్రాత్మకమైన రోజు: భట్టి

సింగరేణిలో రూ. కోటి బీమా పథకం సంస్థలోని 43 వేల మందికి వర్తిస్తుందని, ఇది చరిత్రాత్మకమైన రోజని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రూ. కోటి ప్రమాద బీమా అమలు చేస్తున్న ప్రభుత్వం తమదేనని అన్నారు.

## సంపాదకీయం

బుధవారం 28-02-2024

# ఉద్యోగాల పేరుతో పాలకుల వంచన !

ప్రజలను మోసం అధికారం వెలగబెట్టడంలో అందరూ అందదే. ఒకిరిని మించి ఒకరు హామీలు గుప్పించి మోసాలకు పాల్పడుతున్నారు. రాజకీయాల్లో అధికారం కోసం,పదవులు కోసం ఎంతకైనా తెగిస్తారని మన పాలకులు రుజువు చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ మొదలు రాష్ట్రాల్లో అధికారం వెలగబెడుతున్న సిఎంలు కూడా ఇందుకు అతీతం కాదు. తెలంగాణలో అడ్డంగా,నిలువుగా కెసిఆర్ నిరుద్యోగులను మోసం చేశారు. లక్షా40వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. పేపర్ లీకేజీలతో ఉద్యోగాలే భర్తీ చేయకున్నా అంతకు ముందు ఉద్యోగాలు భర్తీ చేశామని కుటుంబమంతా బుకాయించింది. బాకా పత్రికలు నిజమేనని రాశాయి. అడ్డంగా దోచుకుని రాజకీయంగా అధికారం కోల్పోవడంతో ఇప్పుడు తట్టుకోలేకపోతున్నది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అవినీతిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని దుస్థితిలో ఎదురుదాడికి దిగుతోంది. ఇకపోతే ఎపిలో కూడా జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను, ఉద్యోగులను కూడా మోసం చేసింది. మొన్నటికి మొన్న డిఎస్సీ ప్రకటించి..అదికూడా అందని ద్రాక్షగా చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే పాలకులు అనేక విధాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రజలను మోసం చేయడం, వంచించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. నిజానికి మంచిపనులు చేసివుంటే ప్రజలు నేరుగా ఓటేస్తారు. ఇదే ప్రభుత్వం కావాలని కోరుకుంటారు. కానీ అధికారం, అరాచకం,రాజకీయం, బంధుప్రీతి, అవినీతి కలగవడం వల్ల ప్రజల సంక్షేమం కనిపించడం లేదు. లక్ష్యం లేని పాలన సాగిస్తున్నారు. ఇందుకు ఎవరు కూడా అతీతులు కాదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ ఏలుబడిలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఉపాధది కరువయ్యింది. బతకడమెలా అన్న ఆందోళన కలుగుతోంది. ధరలు దాడి చేస్తున్నాయి. ఇటీవల వెలువడ్డ లక్నో ఐఐఎం నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. జాతీయ శాంపిల్ సర్వే, ఉద్యోగ నిరుద్యోగ సర్వే, పీరియాడిక్ లేబర్ నివేదికల గణాంకాలను మథించి, ఉద్యోగ కల్పనలో మోడీ ప్రభుత్వం చేతులెత్తేసిన వైనాన్ని ఈ పరిశోధన తేటతెల్లం చేసింది. దేశంలో ప్రతిఏటా పట్టభద్రులు పెరుగుతున్నా అందుకు తగ్గట్టు ఉద్యోగ కల్పన జరగలేదని, పైగా అది నానాటికీ తీసికట్టుగా తయారవుతుందని ఈ నివేదిక పేర్కొంది. ఈ తాజా అధ్యయనం ఒక్కటే కాదు; గత కొన్నేళ్లుగా దేశంలో ఏ గణాంక సంస్థ సర్వే చూసినా పాలకుల 'అభివృద్ధి' కబుర్లలోని డొల్లతనం బట్టబయలు అవుతుంది. ఉద్యోగం అంటే ఒక కుటుంబానికి శాశ్వతమైన భరోసా. పౌరుల, తద్వారా దేశం స్థిరమైన భవిష్యత్తుకు బాసట. కానీ, ఉదార ఆర్థిక విధానాలు ముమ్మరంగా అమలవ్వటం మొదలయ్యాక ఈ నమ్మకానికి గండి పడిందిచేకూరుస్తూ కోట్లాది మంది సామాన్యులూ అరకొర వేతనాలతో, భద్రత లేని కొలువులతో దినదిన గండంగా బతుకునీడ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వరంగంలోనూ, ప్రయివేటురంగంలోనూ తీవ్రమైన ఉద్యోగ అభద్రత నెలకొంది. పాలకులు పెద్ద పెద్ద కార్పొరేట్ల కంపెనీలకు వేల కోట్ల రాయితీలను కట్టబెట్టి, స్థానికంగా ఎక్కువ ఉపాధిని కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఎండగట్టారు. పేరుకు మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా అంటూ అట్టహాసం చేసినప్పటికీ- గత నలభై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగింది. 20-34 ఏళ్ల వయసు గల యువతలో నిరుద్యోగిత పెరగటంపై నెల క్రితం వెల్లడైన సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సిఎంఐఇ నివేదిక కూడా ఆందోళన వ్యక్తం చేసింది. 2019తో పోలిస్తే మన జిడిపి 2023 నాటికి 16 శాతం పెరిగింది. కానీ, ఆ మేరకు ఉద్యోగ కల్పన పెరగలేదు. సంపద కొంతమంది దగ్గరే పోగు పడుతూ ఉండడం వల్ల, అన్ని రంగాల్లోనూ గుత్తాధిపత్యం చోటు చేసుకుంటూ ఉండడం వల్లా- దేశం ఎదుర్కొంటున్న వైపరీత్యం ఇది. ఒకపక్క ఆర్థిక వృద్ధి కనపడుతున్నా, మరోపక్క అది ఉద్యోగ సృష్టికి దోహదపడకపోవడం ఈ ఉదార ఆర్థిక విధానాల తాత్పర్యం. ఉద్యోగ కల్పన పేరుతో బడా పెట్టుబడిదారులకు బిజెపి ప్రభుత్వం అనేక రాయితీలూ, ప్రోత్సాహకాలూ కల్పిస్తోంది. కానీ, ఆ మేరకు వారు ఉపాధి అవకాశాలను సృష్టించటం లేదు. ప్రభుత్వం వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న లక్షలాది పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఆ పనికి ఎప్పుడో తిలోదకాలు ఇచ్చేసింది. పైగా వేలాదిమందికి ఉద్యోగ భద్రతను కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను నీరుగార్చటం, కార్పొరేట్లకు కట్టబెట్టటం వంటి దుర్మార్గ చర్యలకు పాల్పడుతోంది. ఉన్న ఉద్యోగాలకు దారుణంగా కోత పెడుతోంది. ఈ వాస్తవాలను ప్రజలూ, నిరుద్యోగ యువతీ యువకులూ గ్రహించి ఇప్పుడు ఓటేయాల్సి ఉంది. ఎన్నికల వేళ మరోమారు దగా చేయడానికి వస్తున్న అధికారంల వెలగబెడుతున్న పార్టీలను, గతంలో వెలగబెట్టిన పార్టీలను నిలదీయాలి. లేకుంటే మోసం పోవం ఖాయం. దేశంలో 1987 నుంచి 2005 వరకూ ఎంతోకొంత ఉద్యోగ కల్పన ఉండేది. ఆ తరువాత తిరోగమనం మొదలైందని ఈ నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం 2021 నాటికి దేశంలో 55.61 కోట్ల మంది ఉద్యోగులు ఉండగా, అందులో 30 కోట్ల 52 లక్షల మంది అంటే 54.9 శాతానికి పైగా తమకు తాము సొంతంగా బతుకు తెరువు వెతుక్కున్న వారే! వ్యాపారం చేస్తున్నవారు, చిన్నదో పెద్దదో స్వయం ఉపాధి ఉన్నవారూ ఈ ఉద్యోగ లెక్కల్లో ఉన్నారు. మిగతా వారిలో 12. 67 కోట్లమంది అంటే 22.8 శాతం మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. మిగతా 12.5 కోట్ల మందీ 22.3 శాతం ఏ భద్రతా లేని క్యాజువల్ ఉద్యోగులు! ప్రజలకు స్థిరమైన ఉద్యోగ ఉపాధులు సమకూరినప్పుడే కొనుగోలు శక్తి పెరుగుతుంది. కానీ, మోడీ ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగూ వేయకుండానే యువతను వంచిస్తోంది. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు చైతన్యం కావాలి.

# బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ...




పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి వేటలో పడింది పార్టీ హైకమాండ్. ఇక్కడ బలమైన అభ్యర్థిని బరిలో దింపేందుకు దృష్టి సారించింది. ఇద్దరు, ముగ్గురు నేతలు టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. అయితే మాదిగ సామాజికవర్గ నేతకు టికెట్ఇవ్వడానికి అధిష్టానం మొగ్గు చూపుతుందట. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం లో ఎన్నికల హడావిడి మొదలైంది. ఈ సారి తెలంగాణలో అధిక స్థానాలు గెలిచేందుకు ప్రత్యేక వ్యూహ రచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే పెద్దపల్లి లోక్ సభ నియోజకవర్గంలో మాత్రం గట్టి నేత లేకపోవడంతో ఏమి చేయాలో నేతలు ఆలోచిస్తున్నారట. ఇప్పటివరకు ఉన్న వివేక్ కాంగ్రెస్ పార్టీలో చేయడంతో బలమైన నేత కరువయ్యాడు. ఇక్కడి నుంచి వివేక్ బరిలో ఉండే అవకాశం ఉండటం తో.. ఇతర నేతలపై దృష్టి పెట్టలేదట పార్టీ అధిష్టానం. అయితే.. అసెంబ్లీ ఎన్నికల ముందు.. వివేక్ బీజేపీ వీడి.. కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఒక్కసారి రాజకీయ పరిణామాలు మారి పోయాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన కుమార్ మరోసారి టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా.. మాజీ ఎమ్మెల్యే కాసిపేట్ లింగయ్య టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట. ముఖ్యంగా పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలో మాదిగ సామాజిక వర్గంతోపాటు మాదిగ ఉప కులాలు ఓట్లు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. మాదిగ సామాజిక వర్గం నేతలపై దృష్టి పెట్టారు. బీఆర్ఎస్ పార్టీలో బలమైన నేతలతో పాటుచ కాంగ్రెస్ లో ఉన్న బలమైన నేతలు చేర్పించుకునేందుకు దృష్టి పెడుతున్నారు. ఇప్పటికి ఇద్దరు, ముగ్గురు నేతలు బీజేపీ టచ్‌లోకి వెళ్లారట. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో మోదీ హావా, రామ మందిర్ నిర్మాణం అంశాలు విజయానికి దోహద పడుతాయని భావిస్తున్నా రు. ఈ నియోజకవర్గంలో సింగరేణి ఓట్లు కూడా కీలకం. ఈ ఓట్లను రాబట్టుకోవడానికి ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో బలమైన నేతలు ఉన్నారు. ఈ రెండు పార్టీలో పోటీ తీవ్రంగా ఉంది. అయితే, ఈ రెండు పార్టీలో టికెట్ రాని నేతలు బీజేపీలో చేరే అవకాశం ఉంది. బీజేపీ మొదటి జాబితాలో పెద్దపల్లి పేరు ఉండదని నేతలు చెబుతున్నారు. ఎలాగైనా ఈసారి పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రత్యేక ఫోకస్ పెట్టారు పార్టీ అగ్రనేతలు. మొత్తానికి పెద్దపల్లిలో బీజేపీ వర్గ విభేదాలు కూడా తలనొప్పిగా మారిపోయాయి. బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎన్నిక నేపథ్యంలో రచ్చ రాజుకుంది. ఇక్కడ అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్టానం తలనొప్పిగా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నేతలు సహకరించుకోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, ఇక్కడ పెరిగిన ఓటు బ్యాంక్ కారణంగా గట్టి పోటీ ఇవ్వడానికి బీజేపీ కసరత్తు మొదలు పెట్టింది.

# కొలువుల భర్తీ పై ఫోకస్...

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎ న్నికల మేనిఫెస్టోలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్ల జారీపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా ఉద్యోగార్థుల డిమాండ్‌ల ప్రకారం మొ దట టీఎస్‌పీఎస్‌సికి కొత్త చైర్మన్, సభ్యులను ని యమించి ప్రక్షాళన చేసిన ప్రభుత్వం, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని ప్రకటించింది. దీంతో నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై భరోసా ఏర్పడింది. గత ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ఫలితాలు వెల్లడించాయి, ఎంపికైన అభ్యర్థులకు వేగంగా నియామక పత్రాలు అందజేసే ప్రభుత్వం, త్వరలోనే కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన 13 వేల మందికి పైగా, గు రుకులాల గ్రాడ్యుయేట్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లుగా ఉద్యోగాలు సాధించిన 1,997 మందికి, స్టాఫ్నర్‌లుగా 7వేల 94 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసారు. ఇప్పటి కే గ్రూప్ -4 ఫలితాలను విడుదల చేసిన ప్రభు త్వం త్వరలోనే నియామక పత్రాలు అందించినది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నా యి. మొదటగా గ్రూప్-1 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్యను పెంచింది. గత ప్రభుత్వంలో 2022లోనే 503 పోస్టులతో నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షల నిర్వాహణలో అక్రమాలు, పేపర్ లీకేజీల కారణంగా గ్రూప్- 1 రెండుసార్లు రద్దయింది. దీనికి 60 పోస్టులు పెంచి 563 పోస్టులతో నూతన నోటిఫికేషన్ విడుదల చేయగా, శుక్రవారం(ఫిబ్రవరి 23) నుంచి దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి మరో ప్రకటన విడుదలైంది. మరోవైపు గత ప్రభుత్వంలోనే పరీక్ష నోటిఫికేషన్లు జారీ అయ్యి, నిర్వాహణలో ఆలస్యమవుతున్న గ్రూప్ -2, గ్రూప్ -3 నోటిఫికేషన్లలో అదనపు పోస్టులు పెంచేందుకు టీఎస్‌పీఎస్‌సి యోచిస్తున్నట్లు తెలుస్తుంది. 2022లో విడుదలైన ఈ నోటిఫికేషన్ల ప్రకారం గ్రూప్ -2లో 783 ఖాళీలు, గ్రూప్- 3లో 1,360కిపైగా పోస్టులున్నా యి. 202 నుండి ఇప్పటివరకు ఏర్పడ్డ ఖాళీలను కలుపుకొని అదనంగా పోస్టులను కలిపి అనుబంధ నోటిఫికేషన్‌లు విడుదల చేయాల్సిన సమాచారం.

త్వరలోనే మెగా డిఎస్సి ప్రకటన

రాష్ట్రంలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ప్రభుత్వ గ్రూప్ భర్తీకి లా మెగా డిఎస్సిని నిర్వహించామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి గతప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా,



1,77,502 మం ది దరఖాస్తు చేసుకున్నారు. 2023 నవంబరు 20 నుంచి 30వ తేదీ మధ్యలో రాతపరీక్ష నిర్వహించా ల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పరీక్ష నిర్వహించబడలేదు. కాగా అప్పట్లో 9,800 పోస్టులు, రేషనలైజేషన్ ఆధారంగా నాటి 5,089 ప్రభుత్వం పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అంశంపై దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం డిఇఒల ద్వారా రాష్ట్రంలోని ఖాళీలను తెలుసుకుంది. ఈ మేరకు పాత నోటిఫికేషన్‌ను అదనంగా దాదాపు 5 వేల పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్ ప్రకటించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ పూర్తి చేసినట్లు తెలిసింది. త్వరలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది, అంతకు ముందే దాదాపు 11 వేల పోస్టులతో మెగా'సి నోటిఫికేషన్ విడుదల ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని విద్యావేత్తలు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోని ఖాళీలను గుర్తిస్తున్న ప్రభుత్వం, ఆవశ్యక వైద్య, విద్యుత్ పోలీసు, వ్యవసాయ తదితర రంగాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లు జారీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. వైద్యారోగ్య శాఖలో 5 వేల పోస్టులను భర్తీ చేయాల్సిన సమాచారం.

వయోపరిమితి 46 ఏళ్లకు పెంపు

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వయోపరిమితిని కూడా సడలించింది. ఉద్యోగార్థుల వయోపరిమితిని 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు ప్రభుత్వం పెంచింది. దాంతోపాటు నోటిఫికేషన్ల జారీలో, పరీక్షల నిర్వాహణలో ఎలాంటి లోపాలు లేకుండా కోర్టులో నియామకాలు ఆలస్యం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని నిపుణులు చెబుతున్నారు.

# చెక్కుల పంపిణీలో భారీ గోల్‌మాల్

హైదరాబాద్,తెలంగాణా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో భారీ గోల్‌మాల్ జరిగింది. ఈ కేసులో తీగ లాగితే డొంక కదిలింది. నమ్మలేని నిజాలు బయటకు వస్తున్నాయి. ఈ స్కాంలో పెద్ద పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యయహారంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు, ప్రజాప్రతినిధుల పీఏల పాత్ర ఉన్నట్లు ఉంది. కేవలం పీఏలే ఉన్నారా లేక ఎమ్మెల్యేల పాత్ర కూడా ఉందా అనే కోణంలో విచారిస్తున్నారు. 200 కోట్ల రూపాయలు గోల్ మాల్ అయినట్టు అంచనా. తెలంగాణలో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సీఎం రిలీఫ్ ఫండ్ పేరుతో పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడినట్లుగా విచారణలో తేలింది. మిర్యాలగూడలో బయడపడ్డ కేసులో తీగ లాగిన అధికారులకు, నమ్మలేని నిజాలు తెలిశాయి. సీఎం రిలీఫ్ ఫండ్ నగదు కోసం నకిలీ పేషెంట్లను రూపొందించడమే కాకుండా తప్పుడు బిల్లులు పెట్టుకొని పెద్ద మొత్తంలో నగదు స్వాహా చేసినట్లు తేలింది. నకిలీ బిల్లులు సృష్టించిన కొద్దీ డబ్బులు స్వాహా ఉన్నాయి. రాష్ట్రంలోని రెండు ఆస్పత్రుల్లో బాధితులకు వైద్య చికిత్స అందించకుండానే.. చేయించినట్లు నకిలీ బిల్లులు సృష్టించారు. వైద్యం చేయకపోయినా.. నకిలీ బిల్లులు సృష్టించిన ఖమ్మంలోని వినాయక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు.. మిర్యాలగూడలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌పై కేసు నమోదు చేశారు. నల్గొండకు చెందిన జ్యోతి, లక్ష్మి, దిరావత్, శివపై కేసు నమోదు చేశారు పోలీసులు. నిరుపేదలకు ఉచితంగా వైద్య చికిత్స అందించడం కోసం ఆరోగ్య పథకాలతో పాటు.. ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తున్నాయి. వాటిలో ఒక సీఎం రిలీఫ్ ఫండ్.. నిరుపేదలకు ఉచిత వైద్య చికిత్సను ఆరోగ్య శ్రీ ద్వారా అందించారు. అయితే కొన్ని వ్యాధులకు అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అవి ఆరోగ్య శ్రీ పరిధిలోకి రావు.. అటువంటి వారికి ఉపయోగపడే మరొక పథకం.. సీఎం రిలీఫ్ ఫండ్..2018లోనే రాష్ట్ర అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యేల సన్నిహిత అనుచరులకు నియోజకవర్గానికి 20 మంది చొప్పున ఎలాంటి మెడికల్ బిల్లులు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల చెక్కులను అందించారు. . దీనితో ఈ వ్యవహారంలో రూ.200 కోట్లు దుర్వినియోగం అయినట్టు అంచనా వేస్తున్నారు. అసలు దీని వెనక ఎవరున్నారు?

ఏ విధంగా ముఖ్యమంత్రి సహాయనిధిని దుర్విని యోగం చేశారు? ఎవరితో ఈ తతంగం నడిపించాలనే దానిపై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అంతర్గతంగా విచారిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ పెద్ద సంఖ్యలోనే ఉన్నది. అయితే అర్హులైన పేదలు రూ.లక్షల్లో పెట్టుకున్న బిల్లులకు రూ.50 వేల లోపే చెక్కుల రూపంలో అందగా.. ఎలాంటి బిల్లులు లేకుండా రూ.లక్షల్లో ఎమ్మెల్యేలకు దగ్గరగా ఉన్నోళ్లకు స్థలాలు.సాధారణంగా ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలు స్తోమతకు మించి ప్రయివేటు హాస్పిటళ్లలో ఖర్చు పెట్టి చికిత్స చేయించుకుంటే.. అందుకు సంబంధించిన పూర్తి బిల్లులను ప్రభుత్వా నికి సమర్పించాల్సి ఉంటుంది. ముందుగా బాధితులు ఎమ్మెల్యేకు దరఖాస్తు చేసుకుంటే వారు సీఎంవోకు పంపుతారు. అక్కడ సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లో కమిటీ పరిశీలించి ఆర్థిక సాయం అందిస్తుంది. ఆ తరువాత మూడు లేదా నాలుగు నెలలకు చెక్కలను ఎమ్మెల్యేల చేతుల మీదుగా బాధితులకు అందజేస్తారు. అయితే 2018లో మూడు వేలకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల్లో లక్షలాది రూపాయలు అధికార పార్టీ ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్లాయి. వారు ప్రత్యేకంగా సూచించిన పేర్లకే రూ.10 రూ.15 లక్షల వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందినట్లు తెలిసిం ది.వడ్డించే వాడు మనవాడైతే.... అవినీతికి పాల్పడేందుకు వాళ్లకు అడ్డదార్లు ఎన్నో వుంటాయి. సి.ఎం. రిలీఫ్ ఫండ్ నుంచి కూడా నొక్క వచ్చని అప్పటి పాలకులు నిరూపించారు. అలా అప్పనంగా డబ్బులు నొక్కేసేందుకు నకిలీ రోగులను సృష్టించడమే కాకుండా..తప్పుడు బిల్లులు పెట్టి కుంభకోణానికి తెరతీశారు.

**గుణహీనుడితోనే చోటు !**

తిరుమల, మనిషి ఎంతటి ఉన్నత విద్యావంతుడైనా గుణహీనుడైతే అతడి వల్ల సమాజానికి ఏమీ లాభం లేదు.లోకంలో తీయగా మాట్లాడేవారికి కొదవ లేదు. కానీ అందరి మాటల్లోనూ ఆత్మీయత ఉంటుందని చెప్పడం సాధ్యం కాదు.కొందరు పైకి చిలుకపలుకులు పలుకుతూ ఊరిస్తుంటారు. ఆచరణలో కపటాన్ని ప్రదర్శిస్తారు. కొందరు పైకి కఠినంగా మాట్లాడతారు కానీ వారు హృదయంలో ప్రేమను, హితాన్ని కలిగి ఉంటారు. పైపై మాటలను చూసి మోసపోరాదు. ఎదుటివారి హృదయాన్ని గ్రహించాలి.

# భూసమస్యలకు పరిష్కారం

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రం రోజురోజుకీ అభివృద్ధిలో ముందు ఉంటుందని చెప్పాలి, ఇక్కడ వనరులు ఉండటమే దీనికి కారణం. అందులో ఇక్కడ ఉన్న భూములకు ఇక్కడ ఉన్న ధరలకు దేశంలో మరెక్కడా లేని విధంగా ఉంటుంది అని చెప్పాలి. రాష్ట్రంలో దూసుకుపోతున్న ప్రధాన రంగాల్లో రియల్ ఎస్టేట్ ఒకటి, ఒక విధంగా భూసంబంధిత సమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. గత పదేళ్ల క్రితం ఉన్న ధరలు ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తే చాలా వ్యత్యాసం ఉంటుంది. ఇటీవల కాలంలో మనం హైదరాబాద్ శివారులో, కొకాపేటలో అత్యధిక భూమి ధర పెరగడం గురించి, సరే ఇలా భూమికి ఎనలేని ధర రావటం, మంచిదే. కానీ దానితో పాటే భూ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ధరణి ఏర్పాటు: గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బృహత్తర కార్యక్రమం ధరణి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ దేశంలో ఉన్నా మన వివరాలు ధరణిలో చూసుకోవచ్చు.అది బాగానే ఉంది. కానీ అంతక ముందు ధరణి ఏర్పాటు చేసే నాటికి, పూర్తి సర్వే లేకుండా, పహణీలలో టైటిల్ ఉందో వారిదే భూమి అనే విధంగా ధరణిలో పెట్టారు. కానీ దీని వల్ల చాలా కేసులు నమోదయ్యాయి. వాస్తవంగా భూమిని ఎవరు చేస్తున్నారు, కాస్తులో కబ్జాలో ఎవరు ఉన్నారు సదా బైనమాలు కొనుగోలు చేసిన రైతులకు టైటిల్ గ్యారెంటీ లేకుండా పోయింది. పూర్తి స్థాయిలో డిజిటల్ సర్వే చేసి ఏళ్లతరబడి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించిన తరువాత ధరణిని తీసుకుంటే ఎలాంటి సమస్యలు లేకుండా ఉంటుంది. ఇప్పుడు దానిని నూతన ప్రభుత్వం భూమాతగా నామకరణం చేసి ఆర్ఓఆర్ చట్టాన్ని సవరించడం చూస్తోంది. ఏదిఏమైనా పూర్తి స్థాయిలో చేస్తేనే దానికి ఒక పరిష్కారం తేగలము.క్షేత్ర స్థాయి సర్వే చేయాలి: ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఇనాం భూములు, దేవదాయ, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు చాలా వరకు కబ్జాకు గురికావడం చాలా జరుగుతున్నాయి. ఆ భూములు పూర్తి స్థాయిలో లెక్కలు తీసి ప్రభుత్వ భూములు కాపాడాలి. ప్రస్తుతం ఉన్న భూములలో క్షేత్రస్థాయి సర్వే ప్రకారం ఎంత భూమి ఉంది, ప్రస్తుతం ఎంత ఉంది అని బహిరంగపరచాలి. అదే విధంగా క్షేత్ర స్థాయి సర్వే వల్ల ప్రధానంగా సమస్యలు ఉన్న భూములకు ఉపయోగపడుతుంది. అదే విధంగా రాష్ట్రం లోనున్న ఏళ్ల తరబడి కోర్టులో మగ్గుతున్న భూసమస్యలకు పరిష్కారం అందుతుంది.కౌలుదారులు: అయితే ముఖ్యంగా రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ రైతులు కౌలు రైతులే ఉంటారు. భూములు పెద్ద మొత్తంలో కొంత మంది దగ్గరే కేంద్రీకృతం అయి ఉంది. కౌలుదారు చట్టం ప్రకారం వాళ్లకు దక్కే అవకాశాలు హక్కులు దక్కడం లేదు. ఇటీవల కాలంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పదిహేను వేలు రూపాయలు ఇస్తా అని చెప్పింది. కానీ వాటి లెక్కలు ఇప్పటికీ తెలియదు. అసలు రాష్ట్రంలో ఎంత మంది కౌలు రైతులు ఉన్నారో తెలియాలి. క్షేత్రస్థాయి సర్వే నిర్వహించడం ద్వారా అది సాధ్యం అవుతుంది. కౌలుదారు చట్టం కూడా కఠినంగా అమలు చేసే విధంగా విధివిధానాలు రూపొందించాలి. రైతు బంధు, రైతు బీమా అవన్నీ సేద్యం చేసేవారికీ మాత్రమే దక్కే విధంగా చూడాలి.కాబట్టి పూర్తి స్థాయిలో డిజిటల్ సర్వే నిర్వహించడం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.డిజిటల్ యుగం: ప్రస్తుతం అంతా అరచేతిలో ప్రపంచం చూసే రోజులు ఇవి. ఇంత సాంకేతిక యుగంలో మనం ఉన్నాం. ఇంకా మనం పాతపద్ధతులనే పాటిస్తున్నాము. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిజిటల్ సర్వే చేద్దాం అని అనుకున్నా చేయలేక పోయింది. ఈ ప్రభుత్వం అయినా చేసి ఉన్న సమస్యలకు చెక్ పెట్టే విధంగా చూడాలి. కాబట్టి వెంటనే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచన చేసి భూ సమస్యలకి పరిష్కారం కావాలి అని కోరుకుందాం...!

# దాగుడుమూతల తగవు

అమరావతి,అమరాతి విషయంలో సిఎం జగన్ తప్పటడుగులు వేశారని కోర్టులు, కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం మాత్రం తప్పుదిద్దుకునే ప్రయత్నాల్లో లేదు. విశాఖ రాజధాని అని చెబుతున్నవారు మూడేళ్ల క్రితమే ఆ పని చేసివున్నా ఈ పాటికి ఎపికి ఓ రాజధాని అనేది ఉండేది. విశాఖను కూడా రాజధాని చేసుకుంటే అడ్డుకునే వారు ఉండేవారు కాదు. కానీ మూడు రాజధానుల పేరుతో ఆడిన నాటకాలు ఎపి పురోభివృద్ధిని దెబ్బతీసాయి. రాజధాని అన్నది లేకుండా చేశాయి. అందుకే దానిని సరిదిద్దు కోవాలని వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇంకా దీనిని కొనసాగించడం వల్ల లాభం లేదన్న విషయం గత నాలుగేళ్లుగా అయినా సిఎం జగన్‌కు అర్థం అయివుండాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులతో ప్రజలను గందరగోళంలోకి నెట్టేశారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా రాజధాని అమరావతి నిర్మాణానికి దోహదపడి ఉంటే బాగుండేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఎన్నికల వేళ దీనిపై ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దన్నారు. రాజధాని లేని రాజ్యం లాగా ఆంధ్రప్రదేవ్ కొనసాగడం ఎంతమాత్రం సరికాదన్నారు. గత ప్రభుత్వంపై కక్షతో ఇలాంటి కీలక విషయంలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్‌ను అంధకారంలో పడేశాయని అన్నారు. అమరావతి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అమరావతి రాజధాని కోసం కేంద్రంతో పోరాడాలని కాంగ్రెస్ నేతలు వైఎస్ షర్మిల, తులసిరెడ్డిలు కూడా డిమాండ్ చేశారు. తాము అమరావతికి కట్టుబడి ఉంటామని అన్నారు. అమరావతిని పక్కన పెట్టడంతో ఎపికి పెట్టుబడులు వెనక్కి పోయాయని టిడిపి నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావులు అన్నారు. రైతుల ఆందోళనతో జై అమరావతి నినాదం హోరెత్తింది.. అమరావతే తమ అంతిమ లక్ష్యం అంటూ అక్కడి రైతులు, మహిళలు, కూలీలు ఉద్యమ పిడికిలి బిగించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా.. అడ్డంకులు కల్పించినా.. కేసులు పెట్టినా అడుగులు వెనకకు పడవంటూ తెగేసి చెప్పారు. రైతులు, మహిళలు దీక్ష చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని నినదించారు. ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న రైతులు, మహిళలు అదే పట్టుదల కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమ లక్ష్యాన్ని గుర్తించి ప్రభుత్వం తక్షణం తన విధానాన్ని సమీక్షించుకోవాలని ఆయా పార్టీల నేతలు సూచించారు. అమరావతి రాజధాని గ్రామం వెలగపూడిలో దీక్ష కొనసాగిస్తున్నారు. అమరావతి ప్రజాదీక్ష పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వైసీపీ మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దుతు తెలిపాయి. అలానే ప్రజా, కులసంఘాలు తమ మద్దతు తెలియజేశాయి. ప్రభుత్వం మూడురాజధానుల బిల్లుల్ని మళ్లీ తేస్తే.. తాడోపేడో తేల్చుకునేవరకూ విశ్రమించబోమని రైతులు తేల్చిచెప్పారు. అమరావతి సాధన ప్రతిజ్ఞ..పాలనా రాజధానిగా అమరావతిని ప్రకటించే వరకు తమ పోరు ఆపేది లేదని దళిత జేఏసీ నేతలు చెప్పారు. రైతులు, మహిళలు తలపెట్టిన దీక్షలకు అన్ని పార్టీలకు చెందిన మహిళా నేతలు తమ మద్దతు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పంతాలకు పోకుండా చూడాల్సి ఉంది. ఇకపోతే ప్రబుత్వం కూడా ఖచ్చింతంగా నిర్ణయం ప్రకటించాలి. రోజుకో మాట మాట్లారాదు. మంత్రులు ఒకమాట, సజ్జల ఒకమాట మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. తాము విశ్రూఖకే కట్టుబడి ఉన్నామంటున్న వారు మిగతా విషయాలు మాట్లాడకుండా రాజధానిని తరలించే ప్రయత్నాలు చేయాలి.

## ఎవరికి వరం..


విజయనగరం : విజయనగరం జిల్లాలోని మరో అసెంబ్లీ నియోజకవర్గం విజయనగరం. విజయనగరం హెడ్ క్వార్టర్(నగర) పరిధి మొత్తం ఈ నియోజకవర్గంలో భాగంగా ఉంది. ఇప్పటి వరకు ఇక్కడ 18 సార్లు ఎన్నికలు జరిగాయి. అత్యధిక సార్లు ఇక్కడ తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఈ నియోజకవర్గం నుంచి ఎక్కువసార్లు టీడీపికి చెందిన అశోక్ గజపతిరాజు విజయం సాధించి రికార్డు సృష్టించారు. నియోజకవర్గ పరిధిలో 2,12,092 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,05,161 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,06,928 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. తొలి ఎన్నిక 1952లో జరిగిందిఇప్పటి వరకు 18 సార్లు ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయి. తొలి ఎన్నిక 1952లో జరిగింది. ఈ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన జి సూర్యనారాయణ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సి సూర్యనారాయణపై 41,056 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన పీవీ రాజు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన జి అప్పలస్వామిపై 36,463 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1953లో సభకు ఉపఎన్నిక జరగ్గా పీఎస్పీ నుంచి పోటీ చేసిన పీవీజీ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పీఎస్పీ నుంచి పోటీ చేసిన పీవీజీ రాజు మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బీవీ సంజీవరావుపై 24,128 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1957లో జరిగిన ఉప ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తి తన సమీప ప్రత్యర్థి బీజేఎస్ నుంచి పోటీ చేసిన వి రామారావుపై 30,649 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1967లో జరిగిన ఎన్నికల్లో బీజేఎస్ నుంచి పోటీ చేసిన వి రామారావు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తిపై 18,359 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పసాని అప్పన్నదొర ఇక్కడి నుంచి విజయం సాధించారు. బీజేఎస్ నుంచి పోటీ చేసిన పి అనవిళ్లపై 23,916 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పసాని అప్పన్నదొరపై 26,085 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పీఆర్ కృష్ణపై 40,392 ఓట్లతో గెలుపొందారు. 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ అశోక్ గజపతిరాజు టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎంఎస్ రావుపై 37,969 ఓట్ల తేడాతో అశోక్ గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మరోసారి బరిలోకి దిగిన అశోక్ గజపతిరాజు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై 9747 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన అశోక్ గజపతిరాజు ఐదోసారి విజయాన్ని దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మరోసారి బరిలోకి దిగిన కోలగట్ల వీరభద్రస్వామిపై 21,031 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజు ఆరోసారి వరుసగా విజయాన్ని దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై వరుసగా మూడోసారి 9131 ఓట్ల తేడదాతో విజయం సాధించారు.2004లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి అశోక్ గజతిపరాజు ఓటమి చవి చూశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి చేతిలో 1126 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2009లో జరిగిన ఎన్నికల్లో మరోసారి టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వీరభద్రస్వామిపై 3282 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన మీసాల గీత ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై 15,404 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన అతిథి గజపతిరాజుపై 6417 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. విజయనగరం అసెంబ్లీ స్థానం విజయనగరం రాజుల అడ్డాగా నిలుస్తూ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు అశోక్ గజపతిరాజు ఇక్కడి నుంచి ఏడుసార్లు విజయాన్ని దక్కించుకున్నారు. ఒకేఒక్కసారి ఆమె ఓటమి పాలయ్యారు. గడిచిన ఎన్నికల్లో తన కుమార్తెను ఈ స్థానం నుంచి బరిలోకి దింపారు. ఆమె కూడా పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే ఓటమి పాలయ్యారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి మరోసారి అశోక్ బరిలో దిగేందుకు సిద్ధపడుతున్నారు. వైసీపీ నుంచి కోలగట్ల వీరభద్రస్వామి పోటీ చేయనున్నారు. వచ్చే ఎన్నిక మరింత ఆసక్తిరకంగా ఉండనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## 11 లక్షల మందికే గృహజ్యోతి?

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి (గృహ జ్యోతి)ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సబ్సిడీ సిలిండర్‌తోపాటు గృహావసరాలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా అందించే గృహలక్ష్మి గృహాల సీఎం రేవంత్ రెడ్డి త్వరలో ప్రారంభించనున్నారు. వీటికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. అయితే హైదరాబాద్ మహానగరంలో గృహలక్ష్మి పథకం మొదటగా 11 లక్షల మంది వినియోగదారులకు వర్తించే అవకాశం తెలుస్తున్నది. వీరి వివరాలన్నీ ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు చేరినట్లు సమాచారం. ఈ మార్చి నెలలో ఈ 11 లక్షల మందికి మాత్రమే సున్నా బిల్లులు జారీ కానున్నాయి. ఈ నేపథ్యంలో అసలు ఎంతమందికి పథకం వర్తిస్తుందనే విషయం ఆసక్తికరంగా మారింది.ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వివరాల సేకరణ ధృవీకరణ ప్రక్రియ, విద్యుత్ సిబ్బంది బిల్లుల జారీ సమయంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. టీఎస్ఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఇప్పటివరకు 30 లక్షల వివరాలను పరిశీలించిన అధికారులు.. వాటిని సీజీకి సమర్పించారు. ఇందులో నగరానికి చెందిన వినియోగదారులు 11 లక్షల మంది మాత్రమే ఉన్నారు. ఆహారభద్రత కార్డు తప్పనిసరి చేయడంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో 55 శాతం మందికి మాత్రమే గృహజ్యోతి వర్తించే అవకాశం కనిపిస్తోంది.గత ఆఖరులో ప్రారంభమైన ప్రజాపాలనలో జీహెచ్‌సి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా డిసెంబర్‌లో 19.85 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో గృహజ్యోతి మ్యాపింగ్ ప్రక్రియ 11 లక్షల వరకు జరిగినట్లు తెలుస్తున్నది. అయితే 8.85 లక్షల మంది దరఖాస్తుదారులు ఏమయ్యాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం 99 శాతం మేర ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, 16 లక్షల మంది వరకు అర్హులు ఉంటారని అంచనా వేసినప్పటికీ.. ఆహారభద్రత కార్డు ఉన్న వాటి వివరాలనే సీజీకి సమర్పించడంతో లబ్ధిదారులు తగ్గినట్లు అధికారులు గుర్తించారు.

# బీజేపీ కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు...

అమరావతి, భారతీయ జనతా పార్టీతో పొత్తు కోసం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు తెగ ఆరాటపడుతున్నారు. ఏపీలో అర శాతం ఓటు షేర్ మాత్రమే ఉన్న బీజేపీని ప్రసన్నం చేసేందుకు చంద్రబాబు ఎదురు చూస్తున్నారు. ఈ నెల మొదటివారంలో ఢిల్లీ వెళ్లి అమిత్ షాని కలసివచ్చిన తర్వాత ఆ పార్టీ ఏం చెప్పిందో ఏ రకమైన ప్రతిపాదనలు చేసిందో తెలియదు కానీ ఇన్నాళ్లూ ఆగి ఇపుడు ఏకంగా 118 మంది అభ్యర్థులతో కలిసి జనసేనతో కలిసి టీడీపీ ఉమ్మడి జాబితాను విడుదల చేసింది. అందులో జనసేనకు ముష్టి వేసినట్లుగా కొన్ని సీట్లు విదిలించేసింది. ఆ సీట్లు చాలు అని జనసేన అధినాయకత్వం అనిపిస్తుంది. ఇక బీజేపీ కి ఎన్ని సీట్లు ఇస్తారో అన్నది ఒక చర్చగా ఉంది. బీజేపీ జాతీయ స్థాయిలో బలమైన పార్టీ. బీజేపీ మరోసారి అధికారంలోకి రాబోతున్న గట్టి పార్టీ అందుకే అన్నట్లుగా మూడవ వంతు సీట్లనే బాబు రిజర్వ్ చేసి పెట్టారు. ఏపీలో ఉన్న మొత్తం 175లో 118 సీట్లను ప్రకటించిన బాబు 57 సీట్లను కూడా పక్కన ఉంచేశారు. అంటే ఇందులో బీజేపీ కోరిన సీట్లు ఇచ్చేందుకే అని అంటున్నారు. బీజేపీతో సీట్ల పితలాటకం ఇంకా తెగలేదు అనడానికి ఈ రిజర్వ్ చేసిన సీట్ల నంబరే సాక్ష్యం అని అంటున్నారు. ఒక వైపు బీజేపీకి ఏపీలో బలం లేకపోయినా సీట్లు ఎక్కువ ఇచ్చేందుకే చంద్రబాబు సిద్ధపడుతున్నారు. బీజేపీ అడిగితే అన్ని సీట్లు ఇస్తారా అంటే బాబు సొంతంగా నెగ్గలేమన్న భయంతోనే ఇలా చేస్తున్నారు అని అంటున్నారు. బీజేపీకి సీట్లు ఇచ్చిన తరువాతనే టీడీపీ చివరి జాబితా రిలీజ్ అవుతుంది అన్నది చూస్తే టీడీపీ దైన్యానికి ఇది ఒక నిదర్శనం అని అంటున్నారు. టీడీపీ గతంలో ఎప్పుడో ఇలా లేదని ఇపుడు సొంతంగా ఎన్నికలకు పోకూడదు అన్న ఉద్దేశ్యంతోనే ఎంతకైనా తగ్గాలని చూస్తోందని, ఫలితంగా అడుగులు పాతాళం వైపే పడుతున్నాయని అంటున్నారు. బీజేపీ ఎన్ని సీట్లు అడిగినా ఇచ్చేందుకు ఓకే అన్నట్లుగా బాబు 57 సీట్లు అలా రిజర్వ్ చేయడాన్ని చూసిన వారు టీడీపీ హిస్టరీ గత వైభోగం ఏమైంది అని ప్రశ్నిస్తున్నారు. ఏపీలో తమకు తిరుగులేదని వైసీపీ పని అయిపోయిందని బాబు చెబుతున్నారు. జనసేన టీడీపీ పొత్తు



పెట్టుకున్న నాడే వైసీపీకి ఓటమి అన్నది అయిందని గంభీరంగా ఉన్నారు. మరి అంత నిబ్బరంగా ఉన్న బాబు మొత్తానికి మొత్తం లిస్ట్ ని ఎందుకు ప్రకటించలేకపోతున్నారు అన్న చర్చ జరుగుతోంది. ఏపీలో బీజేపీ పెద్ద నంబర్ అడిగితే ఇచ్చేందుకు కూడా బాబు సిద్ధమా అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. అలా కనుక చూస్తే అది టీడీపీ పొత్తులతోనే తన అసమర్థతను చాటుకుంటున్నట్లు కాదా అని కూడా అడుగుతున్నారు. పైకి మేకపోతు గాంభీర్యంతో మాట్లాడుతూ గెలిచేది మేమే అని చెబుతూ ఏపీలో ఎక్కడా లేని బీజేపీ కోసం భారీ సీట్లను ఉంచడంలోనే టీడీపీ భయం ఏర్పడిందని అంటున్నారు. పొత్తులు ఎక్కడైనా ఉభయతారకంగా ఉండాలి. కానీ టీడీపీ ఈ విషయంలో అన్ని రకాలుగా తిలోదకాలు ఇస్తూ రాజకీయంగా పార్టీని పతనానికి చేరుస్తూ తామే గెలుస్తున్నట్లుగా గొప్పలు చెప్పుకోవడంపైనే అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రకటించిన జాబితా తీరు చూస్తే కనీసం 120 సీట్లలో అయినా పోటీ చేస్తుందా లేదా అన్న డౌట్లు కూడా వస్తున్నాయని అంటున్నారు. ఏది ఏమైనా రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయి హత్యలు ఉండవు అనడానికి బీజేపీతో పొత్తులే నిదర్శనం అంటున్నారు. చంద్రబాబు తెలివితో చేస్తున్నారా లేదా అన్నది తొందరలోనే తెలుస్తుంది అని కూడా అంటున్నారు.

# పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ తిరుగులేని శక్తిగా భారత్



న్యూఢిల్లీ,ఆర్థిక మాంద్యం సమయంలో సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలోని ఏకైక దేశం భారతదేశం అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పునర్ఘాటించారు. పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, శ్రీలంక ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. బ్రిటన్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలదీ అదే పరిస్థితి. అక్కడ కూడా వృద్ధి రేటు నత్త నడకన సాగుతోంది. వచ్చే పదేళ్లలో భారత్ ఆరు నుంచి ఎనిమిది శాతం వృద్ధి రేటుతో అభివృద్ధి చెందిన దేశంగా అవరించబోతుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. వచ్చే 10 ఏళ్లలో భారత్ సాక్ష్యమివ్వనున్న అద్భుతమైన వృద్ధికి అనుగుణంగా వ్యాపార, వ్యూహాత్మక ప్రణాళికలను రూపొందించుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్. ముంబయిలో జరిగిన '%జ్% ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2023' కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ, రైసినా డైలాగ్ 2024లో భారతదేశంలో వ్యాపారం చేయవలసిందిగా గ్లోబల్ కంపెనీలను ఆయన ఆహ్వానించారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల నుండి లబ్ది పొందేందుకు ప్రభుత్వం వారికి అన్ని విధాలా సహాయాన్ని అందజేస్తుందని స్పష్టం చేశారు. భారతదేశాన్ని ప్రపంచానికి బహిరంగ మార్కెట్‌గా అభివర్ణించిన ఆయన ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల వల్ల భారత దేశం వేగంగా ప్రగతి పథంలో దూసుకుపోతోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి పునాది వేయడం జరిగిందన్నారు. రాబోయే ఐదేళ్లలో విద్య, ఆరోగ్యం, సేవ, తయారీ, సాంకేతిక రంగాల అభివృద్ధిపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2027 నాటికి భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర మంత్రి అశ్విని అంచనా వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరిగాయన్నారు. గత 9 ఏళ్లలో ఇది 615.73 బిలియన్ డాలర్లకు చేరుకుందని వెల్లడించారు. భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా వేగంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం 620.44 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంది. మొత్తంమీద భారతదేశం గ్లోబల్ ఇంజిన్‌కు హబ్‌గా మారే రోజు దగ్గరలోనే ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా భారత్‌పై అంతర్జాతీయ విశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ వృద్ధి అంచనా 7 శాతంగా ఉందన్నారు. కానీ వాస్తవానికి, %చీూ% (నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్) ప్రస్తుత సంవత్సరానికి 7.3% చేరుకుందని, అదీ 2024-

# రసకందాయంగా మారుతున్న హస్తం రాజకీయం

నిజామాబాద్:అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓ విధంగా, మరో విధంగా అన్నట్లుగా మారింది హస్తం పార్టీలో పరిస్థితి. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలకు అభ్యర్థులు లేక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకత్వ ఇబ్బంది వెంటాడుతోంది. ఇందులో ఆధిపత్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే పదవుల పంపకాల కోసం, కీలకమైన స్థానాల్లో స్థానం కోసం నాయకత్వం పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.ఎవరికి వారు అధిష్టానం దృష్టిలో పడేందుకు తహతహలాడుతుండగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంపై పెత్తనం కోసం కూడా పరుగులు తీస్తున్నారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో అర్బన్ నుంచి అనూహ్యంగా షబ్బీర్ అలీ పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తర్వాత ప్రభుత్వం రావడంతో సలహాదారు హోదాలో నియోజకవర్గానికి వస్తున్నారు. ఎన్నికల సమయంలో కేటాయించినంత సమయాన్ని ఇప్పుడు శ్రేణులకు ఇవ్వలేనంత హస్తం శ్రేణులు ఆగమాగమవుతున్నాయి.కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఎవరన్నది పెద్ద పజిల్‌గా మారింది. ఎన్నికలయ్యాక ఓటమి చెందిన చోటనే చోటు చేసుకుంటుండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. అధికార పార్టీ కాంగ్రెస్‌లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గానికి ఇన్‌చార్జి ఎవరన్నది తెలియక కిందిస్థాయి శ్రేణులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. నిజామా బాద్ జిల్లా కేంద్ర నియోజకవర్గానికి ఆశాదీపంగా ఎవరు బరిలో ఉన్నారనేది తెలియకుండా గందరగోళం చోటు చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు డజన్ మంది నాయ కత్వం ఆధీనంలో రాజకీయం కొనసాగింది.పీసీసీతో ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసిన షబ్బీర్ అలీ రాకతో అంతా తా అనుకున్న వారంతా వెనక్కి వెళ్లిపోయారు. ఓటమి చెందిన తర్వాత షబ్బీర్ అలీ అడపా దడపా వచ్చిపోతున్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే తాజాగా ఎమ్మెల్సీగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ఎన్నికవ్వడంతో ఇన్‌ఛార్జ్‌గా ఎవరన్నది ఎటూ తేలడం లేదు. ఆది నుంచి అర్బన్ నియోజకవర్గంపై దృష్టి సారిస్తూ వచ్చిన మహేశ్ కుమార్ గౌడ్ పర్యవేక్షణ నియోజకవర్గం కొనసాగుతుందా? లేదంటే షబ్బీర్ అలీ ఆధీనంలో నాయకత్వం పనిచేస్తుందా? తెలియడం లేదు.

### కామారెడ్డిపై కొండల్ రెడ్డి చూపు...?

కామారెడ్డి నియోజకవర్గంపై సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి కన్నేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి



పీసీసీ చీఫ్ హోదాలో పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఓటమి చవిచూశారు. మూడో స్థానానికి పరిమితం అయ్యారు. రాష్ట్ర వ్యాప్త ప్రచారంలో భాగంగా సమయం లేకపోవడంతో ఇక్కడి బాధ్యతలను తన తమ్ముడు కొండల్ రెడ్డి, కొడంగల్‌కు చెందిన పలువురు ముఖ్యులకు అప్పగించారు. అసెంబ్లీ ఎన్నికలయ్యాక కామారెడ్డి సీటు కాస్త బీజేపీకి చిక్కడంతో పరిస్థితులు తారుమారు అయ్యాయి. షబ్బీర్‌కు కంచుకోట అనుకున్న కామారెడ్డి నియోజకవర్గం కాకుండా పోయింది. నిజామాబాద్ అర్బన్‌కు వలస వెళ్లి పోటీచేసి ఆయన ఓటమి చెందారు. దీంతో కామారెడ్డిపై పట్టు సాధించేందుకు షబ్బీర్‌కు అవకాశం లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారుగా ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ ర్యాంకులో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ కామారెడ్డి నియోజకవర్గంపై షబ్బీర్‌కు భవిష్యత్తులో అవకాశం ఉంటుందా? లేదా? అన్నది తేలడం లేదు. పైగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంపైనా షబ్బీర్ చూపు కొనసాగుతుండడంతో ఎటూ అర్థం కాని దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా కొండల్ రెడ్డి మాత్రం కామారెడ్డిపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించినట్లు తెలిసింది. ఇక్కడి రాజకీయాలపై నిశిత పరిశీలన చేస్తుండగా కామారెడ్డి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు సమయం కేటాయిస్తూ వారి సాధక బాధకాలను పంచుకుంటుండడం చర్చకు దారితీస్తోంది. నిజామాబాద్‌లో రసకందాయంగా మారుతున్న హస్తం రాజకీయం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓ విధంగా, మరో విధంగా అన్నట్లుగా మారింది హస్తం పార్టీలో పరిస్థితి. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలకు అభ్యర్థులు లేక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకత్వ ఇబ్బంది వెంటాడుతోంది. ఇందులో ఆధిపత్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.

## లిక్కర్ స్కామ్ హాట్ టాపిక్కేనా..?

హైదరాబాద్, : ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ ఇందులో నిందితురాలిగా పరిగణించింది. ఈ మేరకు కవితకు సీబీఐ నోటీసులు కూడా ఇచ్చింది. ఈ కేసులో ఫిబ్రవరి 26న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు కవితను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. ఈ కేసులో ఇప్పటికే కల్వకుంట్ల కవితను సీబీఐ మూడుసార్లు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. 2022లో ఇదే కేసులో సీబీఐ ప్రశ్నించింది. లిక్కర్ కేసులో నిందితురాలిగా సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవరిస్తూ తాజాగా మరోసారి సీబీఐ నోటీసులు ఇచ్చింది. అప్పుడు చేసిన దర్యాప్తు తర్వాత కవితను నిందితురాలిగా సీబీఐ పరిగణించింది.లిక్కర్ కేసులో సీబీఐ హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమెను విచారణ చేసి.. ఆమె స్టేట్‌మెంట్ తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా కొన్నిసార్లు కవితను ఢిల్లీలోని తమ కార్యాలయానికి ఆహ్వానించి ప్రశ్నించింది. ఆఖరుసారి గత ఏడాది జనవరి 16న విచారణకు రావాల్సిందిగా కవితకు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 26న తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ ఢిల్లీ సీబీఐ విభాగం ఆమెకు నోటీసులు ఇచ్చింది. మద్యం అమ్మకాలకు సంబంధించి అక్కడి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలో అనేక అక్రమాలు జరిగాయని, అమ్మకందారులకు లబ్ధి చేకూర్చేలా దీన్ని రూపొందించారన్న ఆరోపణలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారినట్లు సీబీఐ ఆరోపణ. నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ కూడా మరో కేసు నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరి 26న అప్పటి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోదియాను అరెస్టు చేశారు. మద్యం అమ్మకాల్లో కీలకంగా మారిన సౌత్ కార్టల్ తరఫున కవిత కీలకంగా వ్యవహరించారని, మద్యం వ్యాపారులతో కలిసి పలుమార్లు సమావేశాలు నిర్వహించారని, ఇదే పనిమీద పలుమార్లు ఢిల్లీ కూడా వచ్చారన్నది సీబీఐ, ఈడీల వాదన.మహిళల్ని ఇంటి వద్దనే విచారించాలని కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్ ఈడీ కేసునకు సంబంధించింది. ఇప్పుడు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఈ నెలాఖరులో విచారణ జరగనున్న సమయంలో సీబీఐ నోటీసులు కలకలం రేపుతున్నాయి. ఈ కేసులో ఆమె ఛార్టర్డ్ ఎకౌంటెంట్ బుచ్చిబాబు, ఆమె తరఫున ప్రతినిధులుగా వ్యవహరించినట్లు కేసులో పేర్కొన్న మద్యం వ్యాపారి, వైసీపీ నాయకుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డి, అరుణ్‌రామచంద్ర పిళ్లై, శరత్‌చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లిని కూడా ఈడీ అరెస్టు చేసింది. వీరిలో మాగుంట రాఘవరెడ్డి, శరత్‌చంద్రారెడ్డిలు అప్రూవర్‌లుగా మారి బెయిల్ సంపాయించారు. తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని రామచంద్ర పిళ్లై అభ్యర్థన మేరకు న్యాయస్థానం అతనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మిగతావారు ఇంకా జైల్లోనే ఉన్నారు.దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు హైదరాబాద్ వచ్చి కవితను ఆమె ఇంట్లో ప్రశ్నించారు. ఈడీ అధికారులు మాత్రం రెండుసార్లు ఢిల్లీ పిలిపించి విచారించారు. తర్వాత సుప్రీంకోర్టులో విచారణకు హాజరు కాకుండా ఆదే?శాలు తెచ్చుకున్నారు కవిత. సీబీఐ నోటీసులు జారీ చేసింది కాబట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చుట్టూ సీబీఐ ఉచ్చు బిగిస్తున్నట్టేనా.. అంటే.. ఈ కేసు బయటకు వచ్చినప్పటి నుండి జరుగుతున్న పరిణామాలను చూస్తే.. కవిత సేఫ్ అన్న అభిప్రాయం ఎక్కువ మందికి వస్తుంది. పార్లమెంటు ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ కి బీజేపీ కి మధ్య ఎటువంటి లాలూచీ కుస్తీ లేదని నిరూపించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి బీజేపీ అగ్రనాయకత్వం తంటాలు పడుతున్న నేపథ్యంలో ఢిల్లీ మద్యం కేసులో ఫిబ్రవరి 26న విచారణకు రావాలంటూ సీబీఐ తాజాగా నోటీసులు జారీ చేసిందని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఎందుకంటే..సీబీఐ కవితను ప్రశ్నించి నెలలు గడిచిపోతోంది. గతంలో హైదరాబాద్ వచ్చి రెండు సార్లు కవితను ప్రశ్నించింది సీబీఐ. రెండో సారి ప్రశ్నించినప్పుడు మరోసారి పిలుస్తామని చెప్పి నోటీసులు ఇచ్చారు. మళ్లీ ఇప్పటి వరకూ సీబీఐ నుంచి పిలుపు రాలేదు. మధ్యలో కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో బాగా లబ్దిపొందారని .. ఆస్తులు సంపాదించారని.. కొన్ని వివరాలతో చార్జిషీట్ వేశారు. మళ్లీ పట్టించుకోలేదు. ఇప్పుడు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈడీ కేసులు వేరు.. సీబీఐ కేసులు వేరు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈడీ వేరుగా విచారణ జరుపుతోంది. ఆ విచారణను తనను పిలవొద్దని సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ వేశారు. నెలల తరబడి వాయిదాల మీద వాయిదాలు పడుతూనే ఉంది. కవిత రిలాక్స్ అవుతూనే ఉన్నారు. ఇప్పుడు సీబీఐ నోటీసులు ఇచ్చింది. సౌత్ లాబీ నుంచి దాదాపుగా అందరూ అప్రూవర్లు అయ్యారు కవిత తప్ప. అలా అప్రూవర్ అయిన మాగుంట రాఘవరెడ్డి ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా కవితకు నోటీసులు ఇచ్చారని అంటున్నారు. అయితే కవితకు నోటీసులు వెనుక అసలు టార్గెట్ కేజ్రీవాల్ అని ఢిల్లీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చెబుతున్నాయి. సీబీఐ కేసు నమోదు చేసింది? మనీ లాండరింగ్ మీద..డబ్బు లావాదేవీల మీద కాదు. స్కామ్ పాలసీలో మార్పు.. క్విడ్ ప్రో కో వంటి అంశాల మీద. మనీ లాండరింగ్ మీద..డబ్బు లావాదేవీల మీద ఈడీ కేసులు నమోదు చేసింది. పాలసీ మార్పు విషయంలో మాగుంట రాఘవరెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. కేజ్రీవాల్ కు, ఆమ్ ఆద్మీ పార్టీకి డబ్బు అందేలా చేశామని ఆయన అంటున్నారు. సౌత్ లాబీకి సంబంధించినంత వరకు ఈ వ్యవహారంలో కవిత పాత్ర కీలకం కాబట్టి ఆమెను విచారణకు పిలుస్తున్నారు. కానీ కవితను గట్టిగా ఫ్రేమ్ చేసే అవకాశాలు లేవని.. కేజ్రీవాల్ ను మాత్రమే టార్గెట్ చేస్తారని అంటున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో గతంలో కేజ్రీవాల్ ను సీబీఐ విచారించింది. ఈడీ విచారణకు మాత్రం కేజ్రీవాల్ హాజరు కావడం లేదు. కవిత విచారణ తర్వాత కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.కవిత విచారణకు హాజరవడం కష్టమేనని న్యాయపరమైన అవకాశాల్ని వెదుక్కుంటారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ ఉన్నందున హాజరుకాబోనని సమాధానం ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయంలో సీబీఐ స్పందన తీవ్రంగా ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలనుకోవడం లేదు. అయితే కేంద్ర దర్యాప్తు సంస్థ .. ఎలా స్పందిస్తుందో అంచనా వేయడం కష్టం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. ఇటీవల కూడా.. తెలంగాణకు వస్తున్న బీజేపీ నేతలు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎవర్నీ వదిలేది లేదని.. తప్పు చేసిన వారిని జైలుకు పంపుతామని అంటున్నారు. అందుకే.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో తదుపరి పరిణామాలు అంచనా వేయడం కష్టమేనని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

## తేడా వస్తే అభ్యర్థులను మార్చేస్తా..

అమరావతి,ఎన్నికల యుద్ధానికి సిద్ధమైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆ పార్టీ అభ్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు. తొలి జాబితా విడుదల చేసిన ఒక రోజులోనే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను హెచ్చరించారు. పనితీరు బాగుంటేనే అభ్యర్థులు పోటీకి దిగుతారని తెలిపారు. పని తీరు సరిగాలేని అభ్యర్థులను మార్చడానికి వెనుకాడనని స్పష్టం చేశారు.శనివారం 94 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో టీడీపీ అధినేత చంద్రబాబు తొలి జాబితా విడుదల చేశారు. వారితో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం వారం అభ్యర్థుల పనితీరును పర్యవేక్షిస్తానని తెలిపారు. పోలింగ్ వరకు సర్వే చేయిస్తానని వెల్లడించారు. అభ్యర్థులపై వ్యతిరేకత ఉంటే వారిని మార్చేస్తానని హెచ్చరించారు. సీటు వచ్చేసిందని నిర్లక్ష్యంగా ఉంటే మరొకరికి ఛాన్స్ ఇస్తానని అభ్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు.ఎన్నికలకు సమయం దగ్గర పడిందని చంద్రబాబు అన్నారు.

# మసకబారుతున్న సిబిఐ సమర్థత




కడప,సిబిఐ చేపడుతున్న కేసుల్లో ఎన్ని నిజాలు నిర్ధారణ అయ్యాయో తెలియడం లేదు. ఎన్ని కేసులు బయటకు వచ్చాయో తెలియడం లేదు. ఇటీవలి కాలంలో కొన్ని కేసులు మాత్రం కేవలం బెదిరింపులకే పరిమితం అవుతున్నాయి. లిక్కర్ కేసులో నిజాలు రాబట్టలేకపోయారు. అంతెందుకు ఐదేళ్లయినా వైఎస్ వివేకాను హత్య చేసిన వారెవరో తేల్చలేదు. నిర్ధారించలేదు. సరికదా కేసును కొలిక్కి తీసుకుని రాలేదు. ఈ కేసులో ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న వారంతా అమయకులని సిఎం జగన్,సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. సొంత చిన్నాన్న హత్యకేసును కొలిక్కి తేవాలన్న దక్షత కూడా లేకుండా పోయింది. నిజానికి అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం సిఐడిని ఉపయోగించి అనేకానేక కేసులను తవ్వుతూ..అనుమానం ఉన్నవారినల్లా బొక్కలో తోస్తోంది. కానీ వివేకానంద రెడ్డి హత్య కేసులో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే అందరికీ అనుమానాలు వస్తున్నాయి. సొంత చిన్నాన్న హత్య కేసును ఛేదించలేని చేవ చచ్చిన పాలకుడిగా జగన్ ప్రజల ముందు నిలిచాడు. మానాన్నను చంపినవాళ్లను ఇంకెప్పుడు పట్టుకుంటారని దారుణ హత్యకు గురైన వై.ఎస్. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి అడిగిన సూటి ప్రశ్నకు నేటికీ సమాధానం దొరకలేదు. సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని స్వయంగా ఆమె ఆవేదన వ్యక్తంచేయడం కూడా జగన్ వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ఈ కేసును హైదరాబాద్‌కు బదలాయించిన తరవాతనే కొంత కదలిక వస్తోంది. అయినా సిబిఐ కూడా దీనిని తేల్చలేక పోయింది. వివేకా హత్యను ఎవరో కానీ చాలా తెలివిగా చేశారని అనిపిస్తోంది. ఎవరికీ చిక్కకుండా ఉంటున్న చిక్కడు దొరకడు ఎవడో సిబిఐ కూడా పట్టుకోలేక పోతున్నది. అంటే పక్కా ప్రణాళికతోనే చేశారని అనుకోవాలి. ఆనవాళ్లు లేకుండా..అనుమానాలు రాకుండా...విచారణలో దొరక్కుండా హత్యను చాలా పక్కగ్గా చేశారని అర్థం అవుతోంది. సిబిఐ కూడా ఈ విషయంలో కూపీలాగ లేకపోతున్నది. మరోవైపు సిబిఐ విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డిని విచారించడం తో వైసిపి ఎందుకనో ఉలిక్కిపడుతోంది. అవినాశ్ రెడ్డి అమాయకుడని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వాపోతున్నారు. రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే వివేకాను హత్య చేశారన్న ప్రాథమిక అంచనా అంటూ ప్రచారం సాగుతోంది. ఇది నిజమా కాదా అన్నది సిబిఐ దర్యాప్తులో బట్టబయలు కానుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో సిఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డిలకు మాత్రం కేసును త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కడా కానరావడం లేదు. పులివెందులలో తమ బంధువులు కాకుండా బయటి వ్యక్తులు వచ్చి హత్య చేసే అవకాశమే లేదని కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిపై తనకు అనుమానం ఉందని డాక్టర్ సునీత.. గతంలోనే చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఎటూ తేల్చకపోవడంతో సిబిఐ పనితీరుపైనా అనుమానాలు పెరుగు తున్నాయి. నిజానికి వివేకా పట్ల గౌరవం ఉండివుంటే ఈ కేసులో సిఎం జగన్ సీరియస్‌గానే స్పందించి ఉండేవారు. డాక్టర్ సునీత ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం చెప్పవలసి వస్తుందనే మౌనంగా ఉంటున్నారా అన్నది కూడా అర్థం కావడం లేదు. కోడికత్తి కేసు కూడా ఇలాగా నీరుగారి పోతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకా హత్య కేసును ఛేదిస్తారని అంతా భావించారు. కానీ నీరుగార్చే ప్రయత్నాలను ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చేశారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఎందుకంటే చంద్రబాబు హయాంలో హత్య కేసును దర్యాప్తు చేయడానికి నియమితులైన అధికారులను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బదిలీ చేశారు. వారిలో కొందరికి పోస్టింగులు కూడా ఇవ్వలేదు. హత్య కేసును నీరుగారుస్తున్నారన్న అనుమానం రావడంతో వివేకా సతీమణి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆమె న్యాయస్థానాన్ని వేడుకున్నారు. సీబీఐ దర్యాప్తు విషయంలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక సీబీఐ దర్యాప్తు అవసరం లేదని ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. దీంతో కేసును త్వరితగతిన ఛేదిస్తారని అంతా భావించారు. కానీ అలాంటిదేమీ లేకుండా పోయింది. సొంత బాబాయ్‌ని దారుణంగా చంపినవారిని పట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఆధీనంలోని పోలీస్ శాఖ ఎందుకు విఫలం అయ్యిందనేదానికి సమాధానం లేదు. అలాగే హత్య ఎవరు చేశారో..ఎందుకు చేశారో పక్కన పెడితే జగన్‌కు ఇందులో ఆసక్తి లేకుండా పోయిందన్నది వాస్తవం. అందువల్ల ఆయన ఈ కేసును పెద్దగా పట్టించుకోవడం లేదు. వైఎస్ షర్మిల కూడా విచారణ జరగాలని కోరుకుంటున్నారు. దోషులు పట్టుబడాల్సి ఉందంటున్నారు. కానీ కుటుంబంలో ఎక్కడా వివేకానంద మర్డర్‌పై సీరియస్‌గా మద్దతు దక్కడం లేదు. ఈ హత్య కేసులో సిబిఐ విచారణ ద్వారా నిజాలు వస్తాయని భావించినా..సిబిఐ కూడా తేల్చలేకపోయింది. సిబిఐ కూడా కేసులు తేల్చడంలో పూర్తిగా విఫలం అవుతోంది.

# అధికారమే గంటా రాజకీయ లక్ష్యం



విశాఖపట్టణం: ఎపిలో తిరిగి అధికారమే లక్ష్యంగా టిడిపి యుద్ధం తరహాలో అధికార వైసిపిపై పోరాడుతోంది. వివిధ సమస్యలే కావచ్చు..లేదా నిర్ణయాలు కావచ్చు ప్రభుత్వం తీరుపై మండి పడుతోంది. ఎక్కడిక్కడ నేతలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడుతున్నారు. వైసిపి పాలనను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ఒకప్పుడు టిడిపిలో అధికారం వెలగబెట్టి, మంత్రిపదవిని అనుభవించిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాత్రం ఆరునెలల క్రిత వరకు అంటీముట్టనట్లుగా ఉన్నారు. ఆయన వైసిపిలోకి వెళతారని ఒకసారి, జనసేనలోకి వెళతారని మరోసారి, బిజెపిలోకి కూడా వెళతారని ప్రచారం సాగింది. గతంలోనే ఆయన వైసిపిలోని వెళ్లాలని ప్లాన్ వేసుకున్నా ఎందుకనో బెడిసికొట్టింది. దీంతో అటు అధికార పార్టీలోకి వెళ్లలేక..ఇక టిడిపిలో ఇమడలేక రాజకీయ దోబూచులాడారు. వైసిపిలోకి వెళ్లాలనుకున్నా విజయసాయి అడ్డుపడడంతో వెనక్కి తగ్గారు. అలాగని టిడిపిలో చురుకుగా లేరు. మూడున్నరేళ్లుగా ఇదే ఆయన అనుసరించారు. దాదాపుగా వైసిపిలో చేరుతారనుకున్న సమయంలో ఆనాటి మంత్రి అవంతి శ్రీనివాస్ అడ్డుపుల్ల వేశారని ప్రచారం జరిగింది. మొత్తంగా అధికారం ఉంటే తప్ప నిలబడని రాజకీయ వ్యవహారాన్ని గంటా అలవర్చుకున్నారు. వైసిపిలో చేరివుంటే ఏదో ఒక పదవిని తగిలించుకుని చురుకుగా తిరిగే వారేమో అని రాజకీయాల్లో చర్చ సాగింది. ఇకపోతే విశ్వాఖ ఉద్యమ సమయంలో ఇచ్చిన రాజీనామాను వ్యూహాత్మకంగా స్పీకర్ సీతారామ్ ఇటీవల ఆమోదించి ఝలక్ ఇచ్చారు. ఇప్పుడేమో గంటా తనసీటు ఎక్కడ అంటూ గంటకొడుతూ బయలుదేరారు. చంద్రబాబు ఏమి హామీ ఇచ్చారో తెలియదు కానీ...భీమిలి కోసం పట్టుబడుతున్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న కాపు నేతగా గుర్తింపు ఉన్నా..రాజకీయంగా మాత్రం అధికారపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. అలాగే అధికారంలో ఉన్నా లేకపోయినా ఎప్పుడూ వార్తల్లో నిలిచేందుకు తాపత్రయ పడతారు. రాజకీయాలను తన చుట్టూ తిప్పుకోవాలనే తాపత్రయం ఆయనలో కనిపిస్తుంది. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినా , టిడిపి అధికారం కోల్పోవడంతో ఆయన రాజకీయ స్తబ్దత పాటించారు. పార్టీకి, ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండలేదు. పార్టీకోసం బహిరంగ వేదికలపైకి వచ్చిన సందర్భం లేదు. వైసిపిలోకి వెళ్లలేక పోయినా టిడిపిలో అయినా రాజకీయంగా చురుకుగా ఉండలేదు. అలాగే చంద్రబాబుతో సఖ్యత కొనసాగించలేదు. ఈ క్రమంలో చంద్రబాబుతో దూరం పెరిగిందనే ప్రచారం ఉంది. ఉత్తరాంధ్రలో పార్టీ పటిష్టత, భవిష్యత్ ప్రణాళికల కోసం చంద్రబాబు ఎమ్మెల్యేలతో ముఖాముఖీ సమావేశం అయిన సందర్భంలోనూ ...గంటా ఎక్కడా కానరాలేదు. దీంతో అసలు ఏం జరుగుతుందనే ఉత్సుకత రాజకీయ వర్గాల్లో రేకెత్తింది. మరోవైపు అధినేతతో కనీసం ఫోన్‌లో అయినా చర్చించేందుకు రావడం లేదు. ఉత్తరాంధ్రలో కూడా టిడిపి గట్టిగా పోరాడుతున్నా ఆయన మాత్రం అంటీ ముట్టనట్లుగా వ్యవహరించారు. చాలాకాలంగా గంటా శ్రీనివాస్ పక్కపార్టీల వైపు చూస్తున్నారనే ప్రచారం సాగింది. మొదట్లో వైసీపీలో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేసినా వర్కవుట్ కాలేదు. మాజీమంత్రి అవంతి, ఎంపీ విజయసాయిరెడ్డి వంటి వారు బహిరంగ వేదికలపైనే వ్యతిరేకించారు. ఆ తర్వాత టీడీపీలోనే కొనసాగాలని నిర్ణయించుకున్న గంటా.. మధ్యలో కాస్త యాక్టివ్ రోల్ తీసుకునేందుకు ప్రయత్నించారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే రెండుపార్టీలు ఒక అవగాహనకు వవచ్చాయి. ఈ తరుణంలో గంటా ఇప్పుడు రాజకీయంగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. తనకు కోరుకున్న భీమిలి సీటు కావాలని పట్టుబడుతున్నారు. మొత్తంగా రాజకీయంగా లబ్ది కలిగితే తప్ప కదలని స్థితిలో ఇప్పుడు గంటా శ్రీనివాసరావు ఉన్నాడన్న ప్రచరం సాగుతోంది.

# కోతుల బెడదతో ప్రజల ఆందోళన



వరంగల్,కోతుల బెడద నివారించేందుకు అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాలని, కోతులను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. కోతులు పట్టేవారిని ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పిస్తే గ్రామాల్లో బెడద ఉండదని అంటున్నారు. అలాగే పంటపొలాలకు కూడా నష్టం ఉండదని అంటున్నారు. అయితే కోతులకు అడవుల్లో ఆవాలసాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి గ్రామాల్లో కోతులకు ఆవాసం లేకుండా చేయాలి. అడవుల్లో నేరేడు, సీతాఫలం, వెలగ, రేగు, మారేడు వంటి పండ్ల మొక్కలు నాటాలనిని చెప్పారు. ఇదిలావుంటే అడవుల్లో కోతులకు అనుకూల వాతావరణం కల్పించి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అంటున్నారు. ఏరియాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచుతున్నట్లు గతంలో చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయితే అవేవీ సాధ్యం కాలేదు. ఇదంతా ప్రచారానికి పరిమితం అయ్యింది. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు పని చేస్తున్నాయని, అటవీ నర్సరీలు ఉన్న గ్రామ పంచాయతీలు మినహాయించి మిగతా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క నర్సరీకి జనాభా, ఇళ్ల సంఖ్య ఆధారంగా 25 వేల నుంచి లక్ష మొక్కలు పెంపకానికి లక్ష్యాలను నిర్దేశిరచినట్లు వివరించారు. అటవీ శాఖకు 40 లక్షలు, గ్రామ పంచాయితీల నుంచి 98 లక్షలు చొప్పన హరితహారం కార్యక్రమానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల్లో 25 శాతం అటవీ పండ్ల మొక్కల పెంపకాన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ గ్రామిణ ఉపాధి హమీ పథకంలో భాగంగా హరితహారం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కానీ కోతుల బెడద నివారణకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

# వేసవికి ముందే నీటి కటకట..!

అయిజ, కూత వేటు దూరంలోనే తుంగభద్ర నది. మిషన్ భగీరథ పథకం కింద మూడు నెలల క్రితం వరకు పుష్కలంగా నీటి సరఫరా. అంతలోనే పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. వర్షాలు ఆశించినమేర లేకపోవడం, ఫిబ్రవరి నుంచే భానుడు భగభగలాడుతుండడంతో నీటి మట్టం క్రమేపీ తగ్గుతూ వస్తోంది.ఫలితంగా వేసవికి ముందే జోగులాంబ గద్వాల జిల్లా అయిజ కోసం రాజాపురం దాహార్తితో అల్లాడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటిఇంటికీ నల్లాల ద్వారా పుష్కలంగా వచ్చే నీరు ఇప్పుడు ముఖం చాటేయడంతో గొంతు తడుపుకునేందుకు గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు.

నాలుగు ట్యాంకర్లతో నీటి సరఫరా

రాజాపురంలో 540 నివాస గృహాలు ఉండగా 2,400 మంది ఉన్నారు. ఒక్కోటీ 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు (1.2 లక్షల లీటర్లు) ట్యాంకులు ఉన్నాయి. నీటి సరఫరా కోసం 530 మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గ్రామానికి సరిపడా నీటిని సరఫరా చేయాలంటే జూరాల పంప్‌హౌస్ నుంచి నీరు అందాలి. కానీ, కృష్ణానదిలో నీటిమట్టం పడిపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో చేతి పంపులు, బోర్లు లేకపోవడంతో నీటికోసం జనం తండ్లాడుతున్నారు.ప్రస్తుతానికి నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోనే తుంగభద్ర నది పారుతున్నప్పటికీ మిషన్ భగీరథ నీటి సరఫరాను పెంచడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎద్దడికి గత సర్పంచ్ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. గ్రామంలో ప్రస్తుతం గుంటి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాలకు బంధువులను ఆహ్వానిద్దామంటే నీటి కొరత వేధించడంతో వెనక్కి జంకుతున్నారు.

కొట్లాట నీటి కోసం

నీటిని మూడు ఎత్తుల నుండి వ్యవసాయ బోరును అధికారులు లీజుకు తీసుకున్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ ట్యాంకర్‌తో పాటు సమీపంలోని పులికల్, బైనపల్లి, కొత్తపల్లి గ్రామాల ట్యాంకర్‌లతో నీటి సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ వచ్చిన సమయంలో నీటి కోసం జనం కొట్టుకుంటున్నారు. క్యూలో బిందెలు ఉంచి వంతు కోసం ఉన్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేయడంతో ట్యాంకర్ల వద్ద ప్రజలు బిందెలు పట్టుకుని పరుగులు పెట్టాల్సి వస్తున్నదని, క్యూలో గంటల తరబడి నిలబడాల్సి వస్తున్నదని గ్రామస్తులు వాపోతున్నారు.



నీళ్లే లేవు.. జాతరెట్ల చేసుకోవాలె

ఎండాకాలం రానేలేదు. నీళ్లు లేకపాయె. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ నల్లాల ద్వారా ఇచ్చెటోడు. ఇప్పుడేమో మా ఊరికి తాగనికె నీళ్లొస్తలేవు. బోర్లు లేవు. చేతి పంపులు లేవు. నీళ్లెట్ల తెచ్చుకోవాలె. ట్యాంకర్లు లేకపోతే సేన్లకెళ్లి తెచ్చుకోవాలె. సేన్ల రైతులు రానీయకపోతే ఎట్ల? నీళ్లు లేక జాతరకు చుట్టాలను పిలువకపోతిమి. సర్కారు దయదాల్చి మా ఊరికి మిషన్ భగీరథ నీళ్లు ఇయ్యాలె.

–హనుమంతమ్మ, రాజాపురం, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా

తుంగభద్ర ఉన్నా నీళ్లు లేకపాయె

తుంగభద్ర నది పక్కనే ఉన్నా నీళ్లు లేకపాయె. మిషన్ భగరీత నల్లాలు ఉన్నా నీళ్లు రాక ఒట్టిపోయాయి. పనులకు పోకుండా ట్యాంకర్ల నీళ్ల కోసం గంటల తరబడి చూడాల్సి వస్తోంది. పనులకు వెళ్లకుండా నీళ్లకే పొద్దంతా పోతుంది. మా ఊరికి తాగేందుకు నీళ్లిచ్చి కష్టాలు తొలగించాలి.

– పద్మమ్మ, రాజాపురం, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా

శాశ్వత పరిష్కారానికి చర్యలు

రాజాపురానికి మిషన్ భగీరథ నీరు అంతంత మాత్రం వస్తున్న విషయం అధికారులతో చర్చించారు. 1.2 లక్షల లీటర్లు రావాల్సి ఉండగా 40 వేల లీటర్లు అందుతున్నాయి. తక్కువ సమయంలోనే ట్యాంక్‌లు ఖాళీ అవుతున్నాయి. ప్రస్తుతానికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. అదనంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయించి ఎద్దడి తీర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– వెంకటయ్య, ఎంపీడీవో, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా

# 11వేలకుపోస్టులకు త్వరలో మెగా డీఎస్సీ..!



హైదరాబాద్,టీచర్‌పోస్టుల భర్తీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీఎస్సీ ద్వారా భర్తీచేసే పోస్టుల సంఖ్యను పెంచింది. మరో 5,973 టీచర్ పోస్టులను అదనంగా భర్తీచేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆర్థికశాఖ సోమవారం పచ్చజెండా ఊపుతూ రెండు జీవోలను జారీచేసింది.జీవో -27 ద్వారా 4,957 పోస్టుల భర్తీ, 1,016 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాల నియామకానికి జీవో -26 ఆర్థికశాఖ జారీచేసింది. గతంలో 5,089 పోస్టుల భర్తీకి గత కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకు పోటీపడేందుకు 1.77లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.రాష్ట్రంలోకొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో డీఎస్సీపై దృష్టిపెట్టింది. మెగా డీఎస్సీని నిర్ణయించామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించడంతో టీచర్ పోస్టులను పెంచింది. ఈ నేపథ్యంలోనే 5,973 టీచర్ పోస్టులకు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపబడ్డాయి,ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్‌నిచ్చింది. ఇంతకుముందు నోటిఫికేషన్‌లో ప్రకటించినవి.. తాజాగా ఆర్థిక శాఖ ఆమోదించినవి కలుపుకొంటే మొత్తం పోస్టుల సంఖ్య 11,062కు చేరింది. గ్రూప్ – 1 తరహాలోనే పాత డీఎస్సీని రద్దుచేయనున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

# సంక్షేమ పథకాలకు తెల్లకార్డే ప్రామాణికం

హైదరాబాద్,రాష్ట్రంలో పేదరికాన్ని నిర్ధారించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త కొలమానాన్ని నిర్దేశించారు. పేదల కోసం అమలు చేస్తున్న పథకాలు అసలైన లబ్ధిదారులకు సంక్షేమం తెల్ల రేషన్‌కార్డును ప్రాథమిక అర్హతగా నిర్ణయించామని తెలిపారు.సచివాలయంలో సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం మీడియాతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు పేదలకు మాత్రమే వర్తించాలని రేషన్‌కార్డు నిబంధనను పెడుతున్నామని. రేషన్‌కార్డు లేనివారికి కార్డులు అందజేయబడతాయి, లబ్ధిదారుల గుర్తింపు నిరంతరం కొనసాగుతుంది. నిరుపేదలు, నిస్సహాయులు ఎవరనేది గుర్తించడానికి ఒక కొలమానం ఉండాలని అన్నారు. లేకపోతే అందరికీ పథకాలను వర్తింపజేస్తే కోటీశ్వరులు కూడా దరఖాస్తు చేసుకుంటారని చెప్పారు.పోటీ పరీక్షల నియోజకవర్గానికి ఒకటి చొప్పున అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటుచేసి ఆన్‌లైన్‌లో ప్రముఖులు, నిపుణులతో పాఠాలు చెప్పాలని నిర్ణయించినట్లు చెప్పారు. రైతుబంధును జనవరిలో మొదలుపెట్టామని, మార్చి 31 నాటికి పూర్తిగా చెల్లిస్తామని చెప్పారు. కేవలం 15 రోజుల్లోనే రైతుబంధు చెల్లించినట్లయితే.. కానీ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు, హాస్టల్ పిల్లలకు నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదని చెప్పారు.

బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు

బీఆర్ఎస్, బీజేపీ గత పదేండ్లలో విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలు, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై శాసనసభ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించేందుకు సిద్ధమా? అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశంలో చెప్తున్న విషయాలనే.. బీజేపీ నేతలు కూడా పొల్లుపోకుండా ప్రెస్‌మీట్‌లో చెప్తున్నారని.ఎప్పటిమాదిరిగానే కాళేశ్వరంపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అప్పులు చేసి ఆస్తులు సృష్టించామని గత ప్రభుత్వం చెప్పిందని.. మిషన్ భగీరథ, కాళేశ్వరంతో ఏమైనా ఆస్తి సృష్టించారా? అని ప్రశ్నించారు. 'అప్పు తెచ్చినప్పుడు దానిని పెట్టుబడిగా పెట్టి.. ఆదాయం వచ్చినప్పుడు అప్పు కట్టాలి. మిషన్ భగీరథకు రూ.50 వేల కోట్లు అప్పు తీసుకొచ్చారు. లక్ష కోట్లు అప్పు తీసుకొచ్చి కాళేశ్వరం కట్టారు. ఒక్క రూపాయి అయినా ఆదాయం సృష్టించి.. వచ్చినతో అప్పు కట్టారా?' అంటూ.మేడిగడ్డ కుంగిందని.. అన్నారం పగిలిపోయిందని చెప్పారు. 'నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ జరిగింది. లక్ష కోట్లు ఖర్చుపెట్టినా.. కాళేశ్వరం కూలిపోకపోయి ఉంటే.. వారు చేసిన తప్పిదాలపై చర్చ కొంత తక్కువ జరిగిపోయింది. ఇవ్వాళ మేడిగడ్డ కుంగిపోయింది.. అన్నారం పగిలిపోయిందని చెప్తుంటే.. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తి అన్నారంలో పోయామంటున్నారు. వితండ వాదనతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు' అంటూ విమర్శలు గుప్పించారు.ప్రాజెక్టుల ద్వారా ఆదాయం వస్తుందని బ్యాంకులకు చెప్పి, ప్రభుత్వానికి వచ్చే నికర ఆదాయాన్ని అప్పుల కింద కట్టే పరిస్థితి కల్పించారు. అందుకే ఆర్థిక సంక్షోభం వచ్చిందని పేర్కొన్నారు. 2014లో రూ.72 వేల కోట్ల అప్పులు ఉండగా.. అవి రూ.7 లక్షల కోట్లకు నేడు చేరాయని. నాడు అప్పు కింద ఏట రూ. 6 వేల కోట్లు మాత్రమే చెల్లిస్తే.. నేడు నిరూపించడానికి ఏటా రూ.1.30 లక్షల కోట్ల ఆదాయం వస్తుండగా.. అప్పు కింద రూ.70 కోట్లు చెల్లించాల్సి వస్తున్నదని అన్నారు.కాళేశ్వరం జలాలతో పెరిగిన భూగర్భజలం, వాటి ఫలితంగా పెరిగిన పంట విస్తీర్ణం, పెరుగుతున్న దిగుబడి, రైతులకు పెరిగిన ఆదాయం వంటి అంశాలను సీఎం విస్మరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగింది కదా? అన్న ప్రశ్నకు సమాధానంగా.. రాష్ట్రం వచ్చినప్పుడు 18 లక్షల పంపుసెట్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు 29 లక్షలకు పెరిగాయి.అదనంగా వచ్చిన 11 లక్షల పంపుసెట్ల కింద సుమారు 40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు పెరిగిందని, అందుకే ఉత్పత్తులు కూడా పెరిగాయని వివరించారు. అంతే తప్ప గత ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులతో భూగర్భ జలాలు పెరిగాయని, నాణ్యమైన ఉచిత విద్యుత్తు వల్లే రైతులు సాగు విస్తీర్ణం పెరిగిందని, పంపుసెట్ల వినియోగం పెరిగిందంటూ పలువురు నిపుణుల పరిశీలన సీఎం అంగీకరించలేదు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com